# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 24 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 29 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :24 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 29 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## మంగళగిరిలో 372 మందికి
## ఇంటి పట్టాలు పంపిణీ

- కుంచనపల్లిలో 372 మందికి ఉచితంగా ఇంటి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి నారా లోకేశ్
- ఇప్పటికే రెండు విడతల్లో 5,636 మందికి పట్టాలు అందించినట్లు వెల్లడి
- రూ.2 వేల కోట్ల విలువైన భూములకు ఆస్తి హక్కులు కల్పించినట్లు ప్రకటన
- వచ్చే ఏడాది 100 పడకల ఆసుపత్రి అందుబాటులోకి తెస్తామని హామీ
- 2029 నాటికి నియోజకవర్గంలోని అర్హులందరికీ పట్టాలు అందిస్తామని లోకేశ్ వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**మంగళగిరి నియోజకవర్గంలో 80 శాతం పట్టాల సమస్య పరిష్కారమైందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కుంచనపల్లిలో 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా 372 మందికి ఉచితంగా ఇంటి పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన మెజారిటీ కారణంగానే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సొంత నిధులు కూడా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు."ఇప్పటికే రెండు విడతల్లో 5,636 మందికి పట్టాలు ఇచ్చి రూ.2 వేల కోట్ల విలువైన భూములకు ఆస్తి హక్కులు కల్పించాం. మంగళగిరిలో పునాది వేసిన ఈ కార్యక్రమాన్ని విశాఖ,

- మిగతా 2లో



## ఏనుగుల సంచారంపై
## డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

- చిత్తూరులో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి మళ్లించాలని పవన్ కల్యాణ్ ఆదేశం
- ఆపరేషన్ కోసం ముసలమడుగు నుంచి కుంకీ ఏనుగులను తీసుకురావాలని సూచన
- పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం
- మానవ-ఏనుగు ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం

**పెన్ పవర్ డెస్క్:**చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాందోళనలకు గురిచ ేస్తున్న ఏనుగుల గుంపును వెంటనే అడవిలోకి సురక్షితంగా మళ్లించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. సోమవారం పడిపుట్లబైలు సమీపంలో ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.గత 15 రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, దాని నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నాయని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏనుగులు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఒక ఏనుగుల గుంపు రహదారి దాటి మంగళంపేట బీట్‌లోకి ప్రవేశించగా, మరో రెండు ఏనుగులు చిత్తూరు వైపు కదులుతున్నాయని

- మిగతా 2లో

## ప్రతిభకు ప్రోత్సాహం.. అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా

- మంత్రి లోకేశ్‌తో సమావేశమైన భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజయ్ రెడ్డి
- ఏపీలో అంధుల క్రికెట్‌ను బలోపేతం చేయడంపై కీలక చర్చ
- క్రీడాకారులకు పూర్తి మద్దతు ఇస్తామని లోకేశ్ భరోసా
- అంధ క్రికెటర్ల కోసం ప్రత్యేక మైదానాలు ఏర్పాటు చేస్తామని హామీ
- వారి ప్రతిభ, సంకల్పానికి అండగా నిలుస్తామన్న మంత్రి

- మిగతా 2లో





## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

- కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి వర్షాల అంచనా
- గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం
- రానున్న 72 గంటల్లో బంగ్లాదేశ్ వైపు తీరం దాటే సూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

- మిగతా 2లో




## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన
- స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి

- మిగతా 2లో

## జగన్ పాలనలో బీసీలకు ద్రోహం

- జగన్ పాలనలో బీసీలకు తీవ్ర ద్రోహం జరిగిందన్న మంత్రి కొల్లు రవీంద్ర
- బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటన
- 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించారని వైసీపీ ప్రభుత్వంపై విమర్శ
- బీసీల అభ్యున్నతికి బడ్జెట్‌లో రూ.32,534 కోట్లు కేటాయించామని వెల్లడి
- కూటమి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణకు చిత్తశుద్ధితో ఉందని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**జగన్ ప్రభుత్వ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం

- మిగతా 2లో

## 15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

### సచివాలయ ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి స్వామి

- ఉద్యోగులను వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నారని మంత్రి స్వామి ఆరోపణ
- అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదని హెచ్చరిక
- నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టీకరణ
- రెండు క్యాజువల్ లీవులకు ఉన్నతాధికారుల అనుమతి అవసరం లేదన్న మంత్రి



**పెన్ పవర్ డెస్క్:**గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే 15 వేల మందికి పైగా ప్రమోషన్లు ఇచ్చామని, సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్రమంగా ధర్నాలు చేస్తే సహించేది లేదని

- మిగతా 2లో



## ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి

**పెన్ పవర్ డెస్క్:** సీబీఎస్ఈ బోర్డు పరిధిలో ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఏడాది 7, 8, 9వ తరగతి విద్యార్థులకు కల్పించినట్లుగానే ఈ విధానం నుంచి ఆరో తరగతికి కూడా మినహాయింపు ఇవ్వాలని ఆదేశించింది. 2027 ఏప్రిల్ 1 నుంచి త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని సూచించింది. సీబీఎస్ఈ త్రిభాషా విధానంలోని అంశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. అకస్మాత్తుగా సీబీఎస్ఈ భాషా విధానం మార్చడంపై సుప్రీం కోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తింది. ఇప్పటికే ఇతర భాషలు ఎంచుకున్న విద్యార్థులు మధ్యలో మరో భాషకు మారాలంటే ఇబ్బంది పడే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఈ విషయంపై పిటిషన్ దాఖలు చేసిన పాఠశాలలను

- మిగతా 2లో

## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ..
## అక్టోబర్ 15 నుంచి అమలు

- యూపీఐ లావాదేవీలపై 0.4% ఛార్జీల విధింపుపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ
- అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధనల అమలుకు మార్గం సుగమం
- రూ.2,000 దాటిన మర్చంట్ చెల్లింపులపై మాత్రమే ఈ ఛార్జీ వర్తింపు
- సాధారణ, వ్యక్తిగత లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టత
- ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలని కేంద్రం, ఆర్‌బీఐకి కోర్టు నోటీసులు



**పెన్ పవర్ డెస్క్:**యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది.ప్రధాన న్యాయమూర్తి

- మిగతా 2లో

## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

- హైదరాబాద్ మణికొండలో చెడ్డీ గ్యాంగ్ ప్రత్యక్షం
- అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడి మహిళపై దాడి
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ముఠా సభ్యుల వీడియోలు
- కేసు దర్యాప్తునకు మూడు ప్రత్యేక పోలీస్ బృందాల ఏర్పాటు
- సెక్యూరిటీ గార్డుల పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు 2లో



## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం..
## నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

- ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు
- నవంబర్ 1 నుంచి రెట్టింపు కానున్న పార్కింగ్ ఛార్జీలు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు
- నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిగా నిషేధం
- ఫిబ్రవరి 28 వరకు అమలులో ఉండనున్న నిబంధనలు - మిగతా 2లో



## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

- 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం
- మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం
- కొందరు చిన్నారులకు సంప్రదాయబద్ధంగా నామకరణం కూడా చేసిన విజయ్ - మిగతా 2లో






## జనసేన దూకుడు.. బలం ఎవరిది ఎంతో తెలుస్తుందా?

జనసేన ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల షేరింగ్ పై పట్టుబట్టే అవాకశముంది. లేదంటే స్నేహపూర్వక పోటీ చేస్తామని బహిరంగంగానే ప్రకటించింది. ఈ నేపథ్యంలో జనసేన డిమాండ్లకు టీడీపీ నుంచి సానుకూలత వస్తుందా? లేదా? అన్నది కూడా ఏపీలో చర్చనీయాంశమైంది. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రాంతాల వారీగా పటిష్ట వ్యూహంతో ముందుకు వెళ్లాలని ఎ జనసేన నిర్ణయించింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరియు రాజకీయ వ్యవహారాల కమిటీ మార్గదర్శకాల ప్రకారం జనసేన అనుసరిస్తున్న ప్రధాన వ్యూహాలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు కూటమిలోని మిత్రుల మధ్య చర్చనీయాంశమైంది. ఎక్కువ మంది టీడీపీ ఎమ్మెల్యేలున్నారు. వారు తమ నియోజకవర్గం పరిధిలో జనసేనకు వాటా ఇచ్చేందుకు అంగీకరించరు. హైకమాండ్ బలవంతం పై బయటకు అంగీకరించినా ఎన్నికల్లో మనస్ఫూర్తిగా పనిచేయరు.

**టీడీపీ, జనసేన సోషల్ మీడియా వార్...**

జనసేన పార్టీ తమకు ప్రాధాన్యత కల్పించకపోతే పోటీకి దిగుతామని ప్రకటించింది. అయితే పోటీకి దిగితే ఎవరి బలం ఏంటో బయటపడుతుందని కొందరు టీడీపీ అభిమానులు సోషల్ మీడియా వేదికగా అప్పుడే జనసేన పై కామెంట్స్ చేస్తున్నారు. 2014, 2024 ఎన్నికల్లో కూటమి గెలుపునకు తామే కారణమని చెప్పుకుంటూ తిరుగుతున్న జనసేన నోరు మూయించాలంటే ఒకరకంగా ఒంటరిగా ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనిస్తే అసలు బలం తెలుస్తోందని కొందరు నేరుగా కామెంట్స్ పెడుతున్నారు. దీంతో రెండు పార్టీల మధ్య సోషల్ మీడియా వార్ మొదలయినట్లే కనిపిస్తుంది. ఒకవేళ హైకమాండ్ నిర్ణయం తీసుకున్నా క్షేత్రస్థాయిలో కలసి పనిచేసే అవకాశాలు మాత్రం ఒకరికొకరు కనిపించని పరిస్థితి ఆల్రెడీ ఇప్పటికే ఏర్పడిందన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. ఇది వైసీపీకి కొంత మేరకు ప్రయోజనం చేకూరుతుందన్న భయం ఉన్నప్పటికీ ఎవరి బలం? ఏంటో తెలిస్తేనే ..గుప్పిట తెరిస్తేనే కదా? అంటున్నారు టీడీపీ నేతలు. ఇలా స్థానిక సంస్థల ఎన్నికలలో మిత్రుల మధ్య కొంత గ్యాప్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**జనసేన మాత్రం ముందుకే...**

మరొకవైపు జనసేన ప్రత్యేక కమిటీల ఏర్పాటు చేసింది. స్థానిక ఎన్నికల నిర్వహణ, సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను నియమించారు.పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఈ కమిటీలు పనిచేస్తాయి.గ్రామ, వార్డు స్థాయిల్లో పార్టీ యంత్రాంగాన్ని ఇవి బలోపేతం చేస్తాయి. అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా కాకుండా, స్థానిక పరిస్థితులకు తగినట్లుగా వ్యూహం మార్చారు.ప్రతి ప్రాంతంలో పార్టీ సామాజిక, సంస్థాగత బలాలను అంచనా వేస్తున్నారు.గ్రౌండ్ రియాలిటీ ఆధారంగా పోటీ చేసే స్థానాలను ఖరారు చేస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన మేయర్ మరియు కీలక స్థానాలపై జనసేన ప్రత్యేక దృష్టి పెట్టింది.పోటీ చేసే ప్రతి చోటా విజయమే లక్ష్యంగా శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు.కూటమి సమన్వయంకూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయ కమిటీల ద్వారా చర్చలు జరుపుతున్నారు.సీట్ల సర్దుబాటు మరియు కేటాయింపులపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుదినిర్ణయంగా ఉంటుందని స్పష్టం చేశారు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపింది. మణికొండలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన ఈ ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.వివరాల్లోకి వెళితే, నిన్న తెల్లవారుజామున మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి చెడ్డీ గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. నివాసంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా, ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆరుగురు సభ్యులు అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లో సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు, స్థానిక సెక్యూరిటీ గార్డులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు భయాందోళన చెందుతున్నారు.

## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు.బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్ఛరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు.

అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు.అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫొటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.

# జగన్ పాలనలో బీసీలకు ద్రోహం

- మొదటి పేజి తరువాయి

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో బీసీలను వెన్నుపోటు పొడిచిన వైసీపీ నాయకులు, ఇప్పుడు దొంగ నాటకాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు.

వైసీపీ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా అణగదొక్కే ఉద్దేశంతోనే స్థానిక సంస్థల్లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందని మంత్రి ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 మంది బీసీలు తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తమ ప్రభుత్వం బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు చిత్తశుద్ధితో ఉందని, ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి, అందుకు అనుగుణంగా కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

బీసీల రక్షణ కోసం ప్రత్యేకంగా "బీసీ రక్షణ చట్టాన్ని" తీసుకురానున్నట్లు కొల్లు రవీంద్ర ఈ సందర్భంగా ప్రకటించారు. నారా లోకేశ్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే ఈ చట్టానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల

అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో రూ.32,534 కోట్లను కేటాయించిందని, వారి ఆర్థిక స్వావలంబన కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని వివరించారు. జగన్ పాలనలో బీసీలపై దాడులు జరిగినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం మత్స్యకారులు, చేనేత కార్మికులు, వడ్డెరలు వంటి అన్ని వర్గాలకు ప్రత్యేక పథకాల ద్వారా భరోసా కల్పిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం.. అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా

ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. భారత అంధుల క్రికెట్ జట్టుకు మూడు ప్రపంచకప్‌లు అందించిన మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి సోమవారం మంత్రి లోకేశ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అంధుల క్రికెట్ ఎదుర్కొంటున్న సవాళ్లు, క్రీడాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు.ఈ భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. అజయ్ కుమార్ రెడ్డిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌ను మరింత బలోపేతం చేయడం, రాష్ట్ర, దేశ స్థాయిల్లో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు మద్దతుగా నిలవడం, ప్రత్యేకించి దృష్టి లోపం ఉన్న క్రికెటర్ల కోసం ప్రత్యేక క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటి కీలక అంశాలపై చర్చించాం" అని లోకేశ్ తెలిపారు.

అంధ క్రీడాకారుల ప్రతిభ, అకుంఠిత దీక్ష, వారు సాధించిన విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. "వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. అజయ్ రెడ్డి వంటి క్రీడాకారులతో నేరుగా చర్చించి, ప్రభుత్వపరంగా పూర్తి మద్దతు ప్రకటించడం పట్ల రాష్ట్రంలోని అంధ క్రీడా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## మంగళగిరిలో 372 మందికి ఇంటి పట్టాలు పంపిణీ

- మొదటి పేజి తరువాయి

విజయవాడతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నాం. వచ్చే ఏడాది 100 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తాం. రానున్న ఎన్నికల్లోగా ప్రతి ఇంటికీ తాగునీరు, భూగర్భ డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తాం. కేంద్రం పరిధిలోని భూముల సమస్యలపై కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. 2029 నాటికి నియోజకవర్గంలో అర్హులందరికీ పట్టాలు అందిస్తాం" అని లోకేశ్ తెలిపారు.

## ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి

- మొదటి పేజి తరువాయి

సంప్రదించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు.

## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది.

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది.ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది.ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ.. అక్టోబర్ 15 నుంచి అమలు

- మొదటి పేజి తరువాయి

సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది.

**కొత్త నిబంధనల ప్రకారం ఛార్జీల స్వరూపం**

సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పీ2పీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. అయితే, ఈ ఛార్జీల ప్రభావం సాధారణ వినియోగదారులపై ఎక్కువగా ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఎవరికి మినహాయింపు?**

వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు.

వ్యాపారులకు చేసే రూ.2,000 లోపు చెల్లింపులు పూర్తిగా ఉచితం.

యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు సున్నా-ఎండీఆర్ నిబంధన వర్తిస్తుంది.

అత్యావసర సేవలకు ఫ్లాట్‌గా రూ.5, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02% చొప్పున తక్కువ ఛార్జీలు వర్తిస్తాయి.

**ఇది పన్ను కాదు, సెటిల్‌మెంట్ ఫీజు: కేంద్రం**

కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ,

ఈ కొత్త ఛార్జీల వల్ల దాదాపు 96% మర్చంట్ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పన్ను కాదని, కేవలం పేమెంట్ సిస్టమ్‌లో భాగమైన ఒక సెటిల్‌మెంట్ ఫీజు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఛార్జీలు నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరని ఆయన వివరించారు. ప్రస్తుతం స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ, కేంద్రం ఇచ్చే వివరణ అనంతరం సుప్రీంకోర్టు ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుంది.

## ఏనుగుల సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

- మొదటి పేజి తరువాయి

అధికారులు పేర్కొన్నారు. ఈ ఏనుగుల సంచారం వల్ల పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మానవ-ఏనుగు ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. "ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. అటవీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలు, హనుమాన్ బృందాలు సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయి బృందాలు నిరంతరం నిఘా ఉంచి, ప్రమాదం పొంచి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు.ఏనుగుల వల్ల పంట నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకుంటూనే, ఏనుగులను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల భద్రత, పంటల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఉద్ఘాటించారు.

## 15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

- మొదటి పేజి తరువాయి

ఆయన గట్టిగా హెచ్చరించారు.సోమవారం అమరావతిలో మంత్రి స్వామి మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన సర్వీస్ రూల్స్ లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చిందని, తమ ప్రభుత్వం వాటిని సరిదిద్దిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సచివాలయ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించినట్లు వివరించారు. దీనిలో భాగంగా రెండు క్యాజువల్ లీవులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాడుకునే వెసులుబాటు కూడా కల్పించామని చెప్పారు.ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ జరుపుతామని చెబుతూనే, ఈ ఆందోళనలకు జగనే కారణమని మంత్రి స్వామి ఆరోపించారు. "గతంలో రూ.15,000 జీతానికి రెండేళ్లు పనిచేసినప్పుడు నిరసన తెలపని వారు, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. గత పీఆర్సీలో వీరిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?" అని నిలదీశారు.

కొన్ని డిమాండ్లపై మంత్రి స్పష్టత ఇచ్చారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఎవరికీ ఇవ్వడం సాధ్యం కాదని, కాబట్టి సచివాలయ ఉద్యోగులకు కూడా ఇవ్వలేమని తేల్చిచెప్పారు.ం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే చూస్తున్నామని, గత ప్రభుత్వం నియమించిందన్న వివక్ష తమకు లేదని అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసిందే తమ ప్రభుత్వమని గుర్తుచేశారు. వారి సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది.

మయన్మార్, అండమాన్ దీవుల సమీపంలో ఏర్పడిన ఈ వాయుగుండం, ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కు 580 కిలోమీటర్ల దూరంలో తూర్పు-ఈశాన్య దిశలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా బంగ్లాదేశ్ వైపు కదులుతోంది. రానున్న 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి, సుమారు 72 గంటల్లో బంగ్లాదేశ్ తీరాన్ని తాకవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ఈ వాయుగుండం ప్రభావంతో ప్రభావిత ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవలే ఉత్తరాంధ్ర తీరంలో కళింగపట్నం వద్ద ఒక తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టం జరిగిన నేపథ్యంలో తాజా హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.



# పల్లె పగ్గాలు.. ఎవరి చేతుల్లోకి..?

**కొత్త జిల్లా.. మొదటి జడ్పీ చైర్మన్ పై ఆసక్తి**

**స్థానిక సమరానికి సై అంటున్న రాజకీయ శిబిరాలు**

**పంచాయతీల నుంచి జడ్పీ వరకు మొదలైన లెక్కలు**

**తొలి జడ్పీ చైర్మన్ పీఠంపై నేతల గురి, రిజర్వేషన్ కోసం ఉత్కంఠ**

**రెబల్స్ భయం,పార్టీలకు కొత్త తలనొప్పి**

**వ్యక్తిగత బలమా, పార్టీ బలమా, చివరికి ఓటరు తీర్పే కీలకం**

**మార్కాపురం (స్టాఫ్ రిపోర్టర్) పెన్ పవర్ సెప్టెంబర్ 28**

కొత్త జిల్లా ఏర్పాటుతో మార్కాపురం రాజకీయ ముఖచిత్రం మారుతోంది. 21 మండలాలతో ప్రత్యేక జిల్లా పరిషత్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. గ్రామ పంచాయతీ నుంచి జడ్పీటీసీ వరకు ఎవరి బలం ఎంత, ఎవరి వెంట ఎంతమంది నాయకులు ఉన్నారన్న లెక్కలు మొదలయ్యాయి. కొత్త జడ్పీ కార్యాలయం ఏర్పాటు కావడంతో జిల్లా పరిషత్ పాలనకు సంబంధించి పరిపాలనా వ్యవస్థ కూడా అందుబాటులోకి వచ్చింది. జడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించడంతో కొత్త జిల్లా పరిషత్ వ్యవస్థకు అధికారిక రూపం ఏర్పడింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న దానిపై రాజకీయ వర్గాల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఎన్నికలు జరిగితే గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తమ బలాన్ని నిరూపించుకునేందుకు నేతలు ఇప్పటి నుంచే సమీకరణాలు మొదలుపెడుతున్నారు.

**పంచాయతీలే పునాది..:** గ్రామస్థాయిలో పట్టు సాధిస్తేనే మండల, జిల్లా స్థాయిలో రాజకీయంగా బలం పెంచుకునే అవకాశం ఉండటంతో పంచాయతీ ఎన్నికలపై నేతలు దృష్టి సారిస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో తమ అనుచరులను గెలిపించుకునేందుకు ప్రధాన రాజకీయ పక్షాలు వ్యూహాలు సిద్ధం చేసుకునే పరిస్థితి నెలకొంది. గ్రామ సమస్యలు, వ్యక్తిగత పరిచయాలు, స్థానికంగా ఉన్న ప్రభావం.. ఈసారి పంచాయతీ ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం ఉంది.

**జడ్పీటీసీ స్థానాలపై కన్ను..:** కొత్త మార్కాపురం జడ్పీ పరిధిలో 21 మండలాలు ఉండటంతో జడ్పీటీసీ స్థానాలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల కేటాయింపుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు కూడా నిర్వహించనున్నారు. దీంతో జడ్పీటీసీ టికెట్ కోసం ఆశావహుల ప్రయత్నాలు, పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు మొదలయ్యే వాతావరణం కనిపిస్తోంది.

**తొలి జడ్పీ చైర్మన్ పీఠంపైనే హీట్..:** అందరి దృష్టి మాత్రం మార్కాపురం తొలి జడ్పీ చైర్మన్ పదవిపైనే. కొత్త జడ్పీకి తొలి చైర్మన్‌గా ఎవరు బాధ్యతలు చేపడతారన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఇప్పటికే చర్చ మొదలైంది. పలువురు ఆశావహుల పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. అయితే చైర్మన్ రిజర్వేషన్ అధికారికంగా ఖరారయ్యే వరకు ఈ పేర్లను తుది అభ్యర్థులుగా చూడటం సరికాదు.ఇదిలా ఉంటే కొత్త జడ్పీ కార్యాలయం కూడా మార్కాపురం జిల్లాలో ప్రారంభమైంది. జడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో కొత్త పరిషత్ వ్యవస్థకు పరిపాలనా రూపం స్పష్టమవుతోంది.

**పార్టీలకు అసలు పరీక్ష..:** స్థానిక ఎన్నికలు రాజకీయ పార్టీలకు కూడా బలపరీక్షగా మారనున్నాయి. పార్టీ గుర్తు ఒకవైపు.. అభ్యర్థి వ్యక్తిగత బలం మరోవైపు.. గ్రామస్థాయిలో ఉన్న పరిచయాలు, స్థానిక సమీకరణాలు ఇంకోవైపు. దీంతో అభ్యర్థుల ఎంపికే పార్టీలకు కీలక సవాలుగా మారనుంది. ముఖ్యంగా జడ్పీటీసీ స్థానాల్లో గెలుపు కోసం పార్టీల మధ్య పోటీ పెరిగే అవకాశం ఉంది. ఆశావహులు పెరిగితే టికెట్ల కేటాయింపులో అసంతృప్తులు, రెబల్ అభ్యర్థుల సమస్యలు కూడా తలెత్తే అవకాశం లేకపోలేదు.

**నేతల లెక్కలు.. ఓటరు తీర్పు..:** ఇప్పటివరకు నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.. పార్టీల్లో వ్యూహాలు నడుస్తున్నాయి.. ఆశావహులు పావులు కదుపుతున్నారు. కానీ చివరికి నిర్ణయం తీసుకునేది మాత్రం పల్లె ఓటరే.రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, సాగునీరు, గ్రామీణ మౌలిక వసతులు వంటి సమస్యలపై ఎవరు స్పష్టమైన హామీ ఇస్తారు, గెలిచిన తర్వాత ఎవరు ప్రజలకు అందుబాటులో ఉంటారు, అన్నదే ఓటరు ముందున్న అసలు ప్రశ్న.

**కొత్త జిల్లా.. కొత్త పందెం..:** మార్కాపురం జిల్లా ఏర్పడింది. ఇప్పుడు కొత్త జడ్పీ కార్యాలయం ఏర్పాటైంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలతో గ్రామాల నుంచి జిల్లా స్థాయి వరకు కొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి రానున్నాయి. పదవుల కోసం నేతల పందెం ఒకవైపు, అభివృద్ధి కోసం ప్రజల ఎదురుచూపు మరోవైపు, పల్లె పగ్గాలు ఎవరి చేతుల్లోకి వెళ్తాయో, తొలి జడ్పీ పీఠాన్ని ఎవరు అధిరోహిస్తారో, మార్కాపురం రాజకీయాల్లో ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# ఒంగోలు 150 ఏళ్ల చరిత్రను ఘనంగా చాటుదాం

**- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు**

**- 30న నిర్వహించనున్న మన ఒంగోలు--మన పండుగను ఘనవిజయం చేకూర్చాలని ప్రజలకు దామచర్ల పిలుపు**






**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

ఒంగోలు మున్సిపాలిటీ గా ఆవిర్భవించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మన ఒంగోలు--మన పండుగ పేరుతో ఈ నెల 30న భారీ వేడుకలను ఏర్పాట్లు చేసినట్లు ఈ ఉత్సవాల్లో నగర ప్రజలందరూ భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే జనార్దన్ రావు ఈనెల 30న 150 ఏళ్ల ఉత్సవాల వివరాలను వెల్లడించారు. చర్చి సెంటర్‌లో అశోకుని స్థూపం ఏర్పాటు చేయడంతో పాటు, ఒకే రోజు 150 మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టామని అన్నారు. ఒకే గంటలో 80 వేలకు పైగా ఇళ్లను సందర్శించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వరల్డ్ రికార్డులో ఒంగోలు ఘనతను చాటి చెప్పాలని అన్నారు. మునిసిపాలిటీ 150 సంవత్సరాలు వేడుకలు మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహించాలని తొలుత నిర్ణయించినప్పటికీ పరిస్థితుల దృష్ట్యా ఈ నెల 30న ఒక్క రోజే ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దామచర్ల తెలిపారు. 30వ తేదీ ఉదయం సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ కార్యక్రమాలు, ప్రముఖుల సన్మానాలు ఉంటాయని చెప్పారు. ఇక మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5.00 గంటల వరకు మినీ స్టేడియం నుంచి అద్దంకి బస్టాండ్ ఎన్టీఆర్ విగ్రహం వరకు 75 జతల భారీ ఎద్దుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.150 ఏళ్ల చరిత్ర అంటే ఒక సువర్ణ అధ్యాయం..! ఒంగోలు పౌరుషానికి, రైతు సంస్కృతికి ప్రతీకగా ఈ ప్రదర్శన నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, గవర్నర్ కంభంపాటి హరిబాబు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఒంగోలు ఎంపీ, పలువురు ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. 150 ఏళ్ల చరిత్ర.. ఒక్కరోజు వేడుక కాదని.. ఒంగోలు ప్రతి పౌరుడి గర్వకారణం అని అందరూ ఈ మహా ఉత్సవాన్ని తమ సొంత పండుగగా భావించి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు కోరారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ తుమ్మల వెంకట కృష్ణయ్య, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగొర్ల వెంకటరావు, నగర టీడీపీ అధ్యక్షులు బండారు మదన్ పాల్గొన్నారు.

# ఒంగోలు 150 ఏళ్ల వేడుకలను విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ పి రాజా బాబు పిలుపు**

**- 30న నిర్వహించనున్న వేడుకలు పై అధికారులతో కలెక్టర్ సమీక్ష**



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

ఒంగోలు మునిసిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించనున్న పలు కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ పి రాజబాబు క్యాంపు కార్యాలయంలో సాంస్కృతిక శాఖ కమిషన్ చైర్ పర్సన్ పొడపాటి తేజస్విని, ఈవెంట్ మేనేజర్, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య వారి సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా 30వ తేదీ ఉదయం 9 గంటల నుండి పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు సుభాని మాండలిన్ స్వరాలు, 10 గంటల 10 నిమిషాలకు అక్సా ఖాన్ బృందం వారిచే శాస్త్రీయ నృత్య ప్రదర్శన, తదుపరి డప్పుల ప్రదర్శన, మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలు గిత్తల అందాల ప్రదర్శన మినీ స్టేడియం నుండి అద్దంకి బస్టాండ్ వరకు నిర్వహించడం జరుగుతుంది. సాయంత్రం 5:30 గంటల నుండి రాత్రి పదిన్నర గంటల వరకు తప్పెట గుళ్ళు ప్రత్యేక ప్రదర్శన, అయాన డాన్స్ బృందం చే స్వాగత సుమాంజలి, డాన్స్ కంపెనీ వారిచే ట్రైన్ యాక్ట్, లైవ్ బ్యాండ్, రాత్రి 10 గంటలకు క్రాకర్స్ షో కార్యక్రమాలు నిర్వహించబడునని జిల్లా కలెక్టర్ తెలిపారు. మన ఒంగోలు మన పండుగ కార్యక్రమంలో ఒంగోలు ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు.

# అభివృద్ధి మాది, అరాచకం మీది: ఎమ్మెల్యే కందుల





**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

అభివృద్ధి తమదైతే అరాచకం ప్రతిపక్షానిదని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని 19, 20, 21, 22 వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని, ప్రజల విజ్ఞప్తి మేరకు అవసరమైన చోట్ల రోడ్లు మంజూరు చేశామన్నారు. వార్డుల్లో మిగిలిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.35 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో పట్టణంలోని ప్రతి అవసరమైన రోడ్డును సీసీ రోడ్డుగా మారుస్తామని, శివారు ప్రాంతాల్లోనూ రోడ్లు వేస్తామన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి, ఇంటింటికి పైప్‌లైన్, హార్టికల్చర్ హబ్‌తో ఈ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

స్థానిక జిల్లా కోర్టు పరిసరాల్లో 11కెవి ఫీడర్ లైన్ మరమ్మత్తులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 07.00 గంటల నుండి 01.00 గంటల వరకు, మునిసిపల్ ఆఫీస్, శివాలయం, సివిఎన్ రీడింగ్ రూమ్, కోర్ట్ సెంటర్, సెంట్రల్ కేఫ్ , ఏనుగు చెట్టు, గాంధీ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కేవీ పాండురంగారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# వైసిపి ట్రాప్‌లో పడొద్దు

**-వారి మాటలు వింటే భవిష్యత్తు ఉండదు**

**-యువతకు సూచించిన ఎంపీ వేమిరెడ్డి**

**-యువత భవితకు భరోసా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే ఇంటూరి**

**-కూటమి ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పిస్తుందని భరోసా**



**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 28:**

వైసిపి నేతల అబద్ధాలు, అసత్య ప్రచారాలను నమ్మొద్దు. వారి మాటలు విని తప్పటడుగులు వేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయి. వైసిపి ట్రాప్ లో పడకుండా, ఆలోచించి ముందడుగు వేయండి అని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి యువతకు సూచించారు. విద్యార్థులు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా యువత భవితకు భరోసా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. కందుకూరులోని బిఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థలకు చెందిన వివేక జూనియర్ కాలేజీలో సోమవారం కార్యక్రమం జరిగింది. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. మన దేశానికి వస్తున్న పెట్టుబడులలో 25 శాతం రాష్ట్రానికి వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న నమ్మకం, భరోసాయే అందుకు కారణం. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ... అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారు. కందుకూరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి పనులే ఉదాహరణ అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రోజుకు 20 గంటల పైన కష్టపడుతున్నారు. కేవలం యువతకు బంగారు భవిష్యత్తు కల్పించాలన్నదే వారి లక్ష్యం అని అన్నారు. ఉద్యోగ ప్రయత్నాలలో విఫలమైతే నిరుత్సాహానికి గురి కావొద్దు. మళ్లీ మళ్లీ ప్రయత్నించండి. ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళండి. విదేశాలకు వెళ్లి డబ్బు, అనుభవం సంపాదించాక... మళ్లీ స్వదేశానికి తిరిగి వచ్చి, పదిమందికి సాయపడటం మాత్రం మరచి పోకండి... అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు, బిపిసిఎల్, ఇండోసోల్ వాటి అనుబంధ పరిశ్రమల ద్వారా వేలాది ఉద్యోగాలు రాబోతున్నాయి. ఇప్పటికే జాబ్ మేళాల ద్వారా అనేకమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాము. రాబోయే రోజుల్లో అవకాశాలు మరింతగా పెరుగుతాయి. యువత సద్వినియోగం చేసుకోవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేతఉన్నం భాస్కర్ రావు, ప్రిన్సిపల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, కాలేజీ ప్రతినిధులు బండి వెంకటేశ్వర్లు, బాలభాస్కర్, నరేంద్ర, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

**-జన సమీకరణపై ముఖ్యనేతల సమావేశం -కందుకూరు నుంచి 10 వేల మందిని తరలించేలా ఏర్పాట్లు**

**-200కి పైగా ఆర్టీసీ బస్సులు -పలు వాహనాల్లో బయలుదేరేందుకు సిద్ధమవుతున్న మూడు పార్టీల శ్రేణులు**

**-మాలకొండ సమీపంలో భోజన వసతి -ఏర్పాట్లను పర్యవేక్షించిన నేతలు**







**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 28:**

పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలంలోని రామాపురం గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం మధ్యాహ్నం ప్రారంభించనున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ సహా పలువురు నేతలు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో కందుకూరు నియోజకవర్గం నుంచి భారీగా జన సమీకరణ జరిపేందుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సిద్ధమయ్యారు. నియోజకవర్గం నుంచి సుమారు 10 వేల మందిని సభకు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి కందుకూరు పట్టణం, ఐదు మండలాల వారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. మహిళలు, యువత, పార్టీ అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, ఇంకా అన్ని వర్గాల వారిని తరలించేలా దృష్టి పెట్టారు.ఈ కార్యక్రమం కోసం నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మండలాల పరిశీలకులు సహా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కూడా నియోజకవర్గస్థాయి నేతలతో జన సమీకరణపై చర్చించారు. ఇప్పటికే విజయవాడ, గుంటూరు, ఒంగోలు ప్రాంతాల నుంచి నియోజకవర్గానికి 200 కి పైగా ఆర్టీసీ బస్సులు కేటాయించారు. ఇది కాకుండా సొంత వాహనాలలో బయలుదేరేందుకు కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. మరోవైపు సభ కోసం తరలి వెళ్తున్న వేలాదిమందికి, మాలకొండ సమీపంలో జాతీయ రహదారి పక్కన, రాజుగారి కొష్టాల వద్ద ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాట్లను నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, ఇంటూరి నాగేశ్వరరావులు సోమవారం సాయంత్రం పరిశీలించారు. గ్రామాలనుంచి బయలుదేరే ప్రతి బస్సుకు, వివిధ శాఖలకు సంబంధించిన ఒక్కొక్కరిని బాధ్యుడిగా నియమించారు.

ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు ఎం.శ్రావణిరెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, జనిజర్ల నాగరాజు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమిట్ల గురునాథం, మాదాల లక్ష్మీ నరసింహం, మండలాల పరిశీలకులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, చదలవాడ చంద్రశేఖర్, పోకూరి రవీంద్రబాబు, గుండవరపు పద్మావతి, తాళ్లపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు.

## విశ్వనరుడు...గుర్రం జాషువా..

***అవమానాలనే గెలుపుకు సోపానాలుగా చేసుకొని, కలాన్ని ఆయుధంగా మలుచుకొని, ఛీత్కారాలు ఎదురైనచోట సత్కారాలు పొందిన రచయిత "గుర్రం జాషువా.".***

***తన జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసి, సామాజిక సమానత్వాన్ని ప్రబోధించిన నవయుగ కవి చక్రవర్తి "గుర్రం జాషువా***

***దళిత వర్గాల జ్వాలాస్ఫూర్తి పద్మభూషణ్ "గుర్రం జాషువా."....***

***జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు స్వరూపరెడ్డి***



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 28**

గుణము లేనివాడు కులము గొడుగు పడతాడు. మానవత్వం లేని వాడు మతం ముసుగు వేస్తాడు. పసలేనివాడు ప్రాంతం ఊసెత్తుతాడు. జనులంతా ఒక కుటుంబం. జగమంతా ఒక నిలయం.అని వెలుగెత్తి చాటాడు "గుర్రం జాషువా.".... ఆధునిక తెలుగు సాహిత్యంలో సామాజిక ప్రయోజనం కోసం భావకవిత్వ రీతినుంచి పక్కకు జరిగి మూఢాచారాలతో తులతూగుతున్న ఆనాటి పెత్తందార్ల అధర్మాలకు అడ్డుకట్టగా నూతన ఒరవడితో తన రచనలు కొనసాగించారు గుర్రం జాషువా. ప్రజల్లో తన రచనల ద్వారా చైతన్యాన్ని రగిల్చారు. జాషువా 1895 సెప్టెంబర్ 28న వీరయ్య, లింగమ్మ దంపతులకు జన్మించిన. తన తల్లిదండ్రులు వేర్వేరు కులాలకు చెందిన వారు కావడంతో తన విద్యాభ్యాస్యంలో అనేక కష్టాలు, అవమానాలు, ఛీత్కారాలు ఎదుర్కొన్నారు. శ్రీశ్రీ లాగా జాషువా కూడా తన కవిత్వంతో ప్రజలను చైతన్య పరిచారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాషువా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి . ఈ వేడుకల్లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి స్వరూపరెడ్డి ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. జాషువా అనేక రచనలు రాశారని. పలు ఖండకావ్యాలు రాశారు. వాటిలో గబ్బిలం, ఫిరదౌసి, క్రీస్తు చరిత్ర అతి ముఖ్యమైనది. ఇదే కోవలో లఘుకావ్యాలు కూడా ఉన్నాయని. ఫిరదౌసి కావ్య వృత్తాంతంలో వేదన పూరితం కనిపిస్తుందన్నారు. పర్షియ చక్రవర్తి గజిని మహ్మద్ ఆస్థానంలో కవి ఫిరదౌసి, అతని రాజు మాటకొక బహుమానం ఇస్తానని చెప్పగా, కవి పదేళ్లు శ్రమించి మహాకావ్యం రాస్తారు. చివరికి అసూయపరుల మాటలు విని రాజు ఇచ్చిన మాటను తప్పుతాడు. ఆవేదనతో ఆ కవి ఆత్మహత్య చేసుకుంటాడు. అక్కడ కవి హృదయాన్ని జాషువా స్వయంగా అనుభవించినట్లు రాశారన్నారు. కవి తనలోని ఆవేదనలు సమాజానికి తెలియపరచడమే జాషువా రచనల సారాంశంగా ఉంటాయనడానికి ఇది నిదర్శనం.అన్నారు జాషువా సమాజంలోని హెచ్చుతగ్గులను వెతికి దానికి గల కారణాలను పరిశీలించి, అనేక కోణాల నుంచి ఆలోచించి తన కంఠంలోని ఆవేదనను కవిత్వ మార్గంగా ఎంచుకున్నారన్నారు. అదే జాషువా "గబ్బిలం" కావ్యానికి శ్రీకారం. దళితులకు జరుగుతున్న అన్యాయాలను ఎలుగెత్తి చాటడం కోసం జాషువా గబ్బిలం రాశారన్నారు. గబ్బిలం కావ్యం 'కాళిదాసు' మేఘసందేశం తరహాలో సాగుతుందని, అయితే గబ్బిలం కావ్యంలో సందేశాన్ని పంపేది యక్షుడు కాదు.. ఒక అంటరాని కులానికి చెందిన కథానాయకుడు తన గోడును సమాజానికి వినిపించడమే కథాంశం అన్నారు. ఉత్తమ జాతి పక్షులుగా పిలువబడే హంసలు, చిలుకలను పక్కకు తీసి సమాజంలోకి అతి వేగంగా దూసుకుపోయేలా 'గబ్బిలం' కవి కళ్లకు దళితంగానే కనిపించిందన్నారు. జాషువా రచనలు అగ్రరాజ్యాధికారం తుదముట్టించే దిశలో కొనసాగాయనిపేర్కొన్నారు. దళితులకు తిండి బట్టలతో పాటు స్వేచ్ఛ జీవనం కూడా దుర్భేద్యంగా ఉండేదని ఆనాటి కాలంలో "కఠిన చిత్తుల దురాగములు ఖండించి కనికార మొలకించు కులమునాది" అందుకే "నిమ్న జాతుల కన్నీటి నీరదములు పిడుగులై దేశమును కాల్చివేయునని" అని హెచ్చరించాడు. గర్జించాడు. శాసించాడు. చతుర్వర్ణ వ్యవస్థను నిలదీస్తూ జాషువా విప్లవ మూర్తిగా సాక్షాత్కరించాడన్నారు. పంచమ కులం ఎక్కడుందని ఆవేదనకు గురయ్యాడు.విశ్వనరుడను నేను నాకు తిరుగులేదు" అని తన వీర కవిత్వాన్ని యావత్ ప్రపంచానికి ఒక చక్కని అక్షర పూలమాలలుగా అందించారన్నారు. ఈ కోవలోనే 1970 ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ, భారత ప్రభుత్వం పద్మభూషణ పురస్కారాలు అందించిందని. అంతేకాకకవికోకిల,కవివిశారద, కవి దిగ్గజబిరుదులు అందుకొన్నారన్నారు. ఎవరూ చూడని చీకటి కోణాలను చూడగల క్రాంతదర్శి కవి కోకిల జాషువా . జాషువా కవిత్వంలో జాలి, దయ, కరుణలు కనిపిస్తాయని. నిజానికి జాషువా జీవితం నుండి అతని కవిత్వం వికసించిందన్నారు. తన రచన ద్వారా అణగారిపోతున్న పేద సమాజాన్ని మార్చాలి అనుకున్నారు. ఆ కోవలోనే ప్రయత్నించారు. జాషువాలో, అతని రచనలలో కసి గానీ, ద్వేషం గానీ లేదు. కేవలం ప్రతిఘటన మాత్రమేనన్నారు. 'రేయి బవలు భారతీయ సంస్కృతి పేర..'' మరో పద్యంలో జాషువ స్పందన ఆలోచింప చేస్తుందని.జాషువ కలాన్ని గళంగా మార్చి విశేష సాహిత్య సంపదను సృష్టించారన్నారు. ప్రజల్లో తన రచనల ద్వారా చైతన్యాన్ని రగిలించారని.ఆయన 1971జులై 24న తుది శ్వాస విడిచారని స్వరూపరెడ్డి తెలిపారు.

## పల్లె పండుగ కార్యక్రమానికి భారీగా తరలిరావాలి

**మన్నేపల్లి కార్తీక్ పిలుపు**



**సి ఎస్ పురం,**
**పెన్ పవర్ సెప్టెంబర్ 28**

వరికుంటపాడు మండలంలోని రామాపురం గ్రామంలో నేడు నిర్వహించనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మండల తెలుగు యువత నాయకులు మన్నేపల్లి కార్తీక్ నాయుడు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడంతో పాటు భారీగా అభివృద్ధి పనులు చేపట్టే లక్ష్యంతో రామాపురం గ్రామం నుంచి పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## వికసిత్ భారత్ 2026లో విద్యార్థుల ప్రతిభ

**-డ్రాయింగ్, ఎలోక్యూషన్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు**





**కందుకూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

వికసిత్ భారత్ 2026 కార్యక్రమంలో భాగంగా కందుకూరు మండల స్థాయి విద్యార్థులకు డ్రాయింగ్, ఎలోక్యూషన్ పోటీలు సోమవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆక్స్‌ఫర్డ్ స్కూల్స్ చైర్మన్ ఉన్నం భాస్కరరావు, విజ్ఞాన్ విహార్ హైస్కూల్ చైర్మన్ గట్టమనేని అఖిల్, నాగార్జున హైస్కూల్ డైరెక్టర్ మర్‌రెడ్డి పాల్గొన్నారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. పోటీల నిర్వహణకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్యతో పాటు ఉపాధ్యాయులు సహకరించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల లెక్చరర్లు రాజగోపాల్, రాజా వ్యవహరించారు. మండల విద్యాశాఖ అధికారులు కె. సుబ్బారెడ్డి, ఎం.ఎస్.కె. శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రసంగ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## అణగారిన వర్గాలకు అండగా మహాకవి గుర్రం జాషువా - జిల్లా కలెక్టర్ పి. రాజబాబు



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

మహా కవి గుర్రం జాషువా పీడిత వర్గాల ఆనాటి పరిస్థితులను వివరించే విధంగా దేవునికి చెప్పడానికి దగ్గరగా ఉండే విధంగా తలకిందులుగా వేలాడే గబ్బిలాన్ని ఎంచుకొని గబ్బిలం వంటి విప్లవాత్మక రచనను రచించారని జిల్లా కలెక్టర్ పి రాజా బాబు అన్నారు. స్వర్గీయ గుర్రం జాషువా 131 జయంతిని ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా తప్ప ఇంకెవరూ రాయలేనంత విధంగా రచనలను కొనసాగించారని అన్నారు. విశ్వనాథ సత్యనారాయణ తో ఆ రోజులలో పోటీ తత్వం ఉండేదన్నారు. అణగారిన వర్గాలు దళితులు అనేది మనం చూసే దృక్పథంలో తప్ప తెలివిలో కాదని ఆయన అన్నారని తెలిపారు. గుర్రం జాషువా తప్ప వేరే ఎవరూ ఇటువంటి కవితలు రాయలేరని అనిపించుకున్నారన్నారు. ఆయన ఆశయాలు సంస్కరణకు అనుగుణంగా మేధా సంపత్తిని పెంపొందించుకొని ఆత్మనూన్యత భావాన్ని విడనాడి సమాజంలో ముందుండాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వివిధ దళిత , ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ అభయాన్ నిర్వహించిన బీజేపీ నాయకులు

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 28**

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ జీ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే నిర్ణయం మేరకు స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ జె వి నారాయణ ఆధ్వర్యం లో గిద్దలూరు పట్టణం సత్యనారాయణ టాకీస్ వీధి లో ఉన్న అంగన్వాడీ కేంద్రం లో టీచర్ ,ఆయమ్మ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాషి వెంకట రామాంజనేయులు, మాజీ జిల్లా కార్యదర్శి ముప్పూరి శ్రీనివాసులు,మొర్రిబోయిన పాండు,అమ్మని,బాబ్జి,మరియు నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జె వి నారాయణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు అందుతున్న పోషక పదార్థాలు,గర్భిణులకు అందుతున్న పోషక పదార్థాలు,మాతృవందన్ యోజన గురించి వివరించారు.



## పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం గట్టి కృషి

**మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి వెల్లడి**




**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 28**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పాత్రిక ఎలా సంక్షేమానికి గట్టి కృషి చేస్తుందని మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు. సోమవారం నాడు పొదిలి లోని విలేకరుల యూనియన్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ పత్రికా రంగం పట్ల కూటమి ప్రభుత్వానికి ఎనలేని గౌరవ మర్యాదలు ఉన్నాయని స్పష్టం చేశారు. అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామని నారాయణరెడ్డి స్పష్టం చేశారు. 165 కోట్ల వ్యయంతో పొదిలి పెద్ద చెరువుకు సాగర్ జలాలు నింపే కార్యక్రమాన్ని ముందుకు తీసుకుని వెళున్నామని ఆయన చెప్పారు. అలాగే 42 కోట్ల వ్యయంతో పొదిలికి ఇంటింటికి త్రాగునీటి సౌకర్యం అందించే విధంగా గట్టి కృషి చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. స్వార్థ ప్రయోజనాల కోసం గత పాలకులు పొదిలి ప్రాంతాన్ని విస్మరించారని ఎమ్మెల్యే నారాయణరెడ్డి విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తుందని, ఇందులో ఎటువంటి అపోహలు పడాల్సిన పనేలేదని ఆయన స్పష్టం చేశారు. పొదిలి లోనే పాత్రికేయుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, వారికి అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు వరికుంట్ల అనిల్ కుమార్, వై వెంకటేశ్వర రెడ్డి, ముల్లా కుద్దూస్, పొదిలి మునిసిపల్ కమిషనర్ కె. రామ్మోహనరావు తోపాటు పలువురు తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

11

అక్టోబర్ 1న ఉదయమే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**గిద్దలూరు: పెన్ పవర్ సెప్టెంబర్ 28**

గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ అక్టోబర్ 1న ఉదయమే యథావిధిగా ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకుల సమ్మె కారణంగా పెన్షన్లను అక్టోబర్ 1న మధ్యాహ్నం నుంచి పంపిణీ చేయాలని తొలుత నిర్ణయించినప్పటికీ, సమ్మె వాయిదా పడటంతో ఉదయం నుంచే పెన్షన్ల పంపిణీ చేపట్టనున్నట్లు కమీషనర్ తెలిపారు. గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో 3,247 మంది పెన్షన్‌దారులకు మొత్తం రూ.1,48,51,000 పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ రమణ బాబు వెల్లడించారు.



# "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ





**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 28**

యువత భవితకు భరోసా కార్యక్రమంలో భాగంగా, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నేడు టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రత్యేకంగా ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం: నేటి విద్యార్థులు, నిరుద్యోగ యువతలో భవిష్యత్తుపై ఉన్న ఆందోళనలు, అపోహలు, సందేహాలను తొలగించి వారిలో ఆత్మవిశ్వాసం నింపడం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, స్టార్టప్ స్వయం ఉపాధి పథకాల గురించి యువతకు అవగాహన కల్పించి, వారి బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇవ్వడమే ఈ కార్యక్రమ లక్ష్యం అని అన్నారు.యువతతో నేరుగా సంభాషించడం, వారి ఆకాంక్షలను తెలుసుకోవడం వారి భవిష్యత్తు పట్ల భరోసా కల్పించడం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ముందుగా ఆయన సెమినార్ హాలులో షహీద్ భగత్ సింగ్, మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా సంభాషించారు. కార్యక్రమం అంతటా విద్యార్థులు పాటించిన క్రమశిక్షణను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాలలోని విద్యా వాతావరణాన్ని, హరితహార కార్యక్రమాలను కొనియాడారు.ఈ సందర్భంగా ఎంపీ విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తరగతి గదుల కోసం 40 సీలింగ్ ఫ్యాన్లను విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఉదారంగా ప్రకటించారు. అంతేకాకుండా, విద్యార్థుల చిరకాల కోరిక అయిన ఎన్సిసి యూనిట్‌ను త్వరలోనే కళాశాలలో పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ కళాశాల ఆవరణలో అభివృద్ధి చేసిన మియావాకి ఫారెస్ట్ ప్రాజెక్టును సందర్శించి, ఈ వినూత్న హరిత కార్యక్రమాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఫోటోలు దిగారు.ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డా. కె.వి. పద్మావతి ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తన విలువైన సమయాన్ని కేటాయించి విద్యార్థులతో స్ఫూర్తిదాయకంగా సంభాషించి, ఉదారంగా సహాయాన్ని ప్రకటించిన ఎంపీ కి ప్రిన్సిపాల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పొదిలిలో ఘనంగా గుర్రం జాషువా, భగత్ సింగ్ జయంతి వేడుకలు





**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 28**

పొదిలిలో ఘనంగా అమరవీరుడు భగత్ సింగ్, మహాకవి గుర్రం జాషువా ల జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం నాడు వేడుకలను గుర్రం జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. పొదిలిలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. వేడుకలకు గుర్రం జాషువా కళాపీఠం గౌరవాధ్యక్షులు కె.వి రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా భగత్ సింగ్, గుర్రం జాషువా ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర సమరం కోసం పిన్నవయసులోనే ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ త్యాగాలు మరువలేని వన్నారు. అలాగే ప్రముఖ సామాజికవేత్త, మహాకవి గుర్రం జాషువా సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అటువంటి మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమం లో వృద్ధ కళాకారులకు శాలువలతో సన్మానించడంతోపాటు పలువురికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో కల్లం వెంకట సుబ్బారెడ్డి, కె ఎల్లమందరెడ్డి, కె శ్రీనివాస రెడ్డి, ఎం పుల్లయ్య, గూడూరి వినోద్, వరికుంట్ల వినోద్ రాజ్, గురువా చారి, యు . ఆదినారాయణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రౌతుపల్లి అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ మహోత్సవ కార్యక్రమం

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవకు గుర్తింపుగా మహోత్సవ కార్యక్రమం





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 28**

కొమరోలు మండలం రౌతు పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో సోమవారం అంగన్వాడి మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ అందించిన 25 సంవత్సరాల ప్రజాసేవ లో భాగంగా అంగన్వాడి కేంద్రాలలో, విద్యాసంస్థలలో అంగన్వాడీ మహోత్సవాలు, బడి పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గిద్దలూరు సిడిపిఓ ఆదేశాల మేరకు సోమవారం కొమరోలు మండలం రౌతు పల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ మహోత్సవం ఘనంగా నిర్వహించారు..ఆ సందర్భంగా చిన్నారులను, తల్లులను, బాలింతలను, గర్భవతులను అంగన్వాడీ కేంద్రానికి ఆహ్వానించి వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీవిత విశేషాలు, ఆయన భారత ప్రధానిగా, గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రజలకు 25 సంవత్సరాలుగా అందిస్తున్నమెరుగైన, ఆదర్శవంతమైన నీతివంతమైన ప్రజాసేవను, దేశాభివృద్ధిని ప్రజా సంక్షేమాన్ని అంగన్వాడీ టీచర్ పి లక్ష్మీదేవి వివరించారు. పండుగ వాతావరణం లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ, రంగవల్లులతో, ఆటపాటలతో అలరింపచేసి బహుమతులు అందించారు. ఆ కార్యక్రమంలో అంగన్వాడీ ఆయా సుబ్బలక్ష్మమ్మ, గ్రామ పెద్దలు,, గర్భవతులు, బాలింతలు,, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఒంగోలు నియోజకవర్గ టిడిపి విస్తృత స్థాయి సమావేశం

**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**



ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు అధ్యక్షతన స్థానిక గుంటూరు రోడ్డు లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఒంగోలు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రతినిధి ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని కావున నియోజకవర్గ స్థాయి సమావేశానికి పార్లమెంట్/మండల/డివిజన్ /గ్రామ కమిటీ నాయకులు , పార్టీ అనుభంద సంఘాల సభ్యులు, క్లస్టర్ /యూనిట్ /బూత్ కన్వీనర్లు కో-కన్వీనర్లు, పార్టీ సీనియర్ నాయకులు,మాజీ కార్పొరేటర్లు, మహిళా నాయకులు,తెలుగు యువత నాయకులు, ఐటీడీపి సభ్యులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని వారు కోరారు.

# ప్రజా సమస్యలకు నిర్దేశిత గడువులోనే పరిష్కారం చూపాలి జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

### - మీ కోసం కార్యక్రమంలో 307 అర్జీలు నమోదు

**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**



ప్రకాశం జిల్లా కలెక్టరేట్‌లోని పిజి ఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పిజి ఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పాల్గొని, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు.. అర్జీలను నేరుగా స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చిన బాధితుల నుండి సోమవారం మొత్తం 307 అర్జీలు నమోదయ్యాయి. జాయింట్ కలెక్టర్ ప్రతి ఒక్కరి సమస్యను ఓపిగ్గా విని, వాటి తక్షణ పరిష్కారం కోసం సంబంధించిన విభాగాధిపతులకు మార్గదర్శనం చేశారు. అర్జీల స్వీకరణ అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ గారు అధికారులకు పలు కీలక సూచనలు, స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీ అత్యంత కీలకమైనదని, అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలని తేల్చి చెప్పారు. అర్జీలను పరిష్కరించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అర్జీదారుడు పూర్తి సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయి పరిశీలన పక్కాగా జరగాలని ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒకే సమస్యపై ప్రజలు పదేపదే కలెక్టరేట్ చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని, పునరావృతమయ్యే (రీ-ఓపెన్) అర్జీల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా భూసంబంధిత, రెవెన్యూ, ఇతర శాఖల మధ్య నలిగిపోయే సమస్యలలో విభాగాలు పరస్పర సమన్వయంతో వ్యవహరించి వేగవంతంగా బాధితులకు న్యాయం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# గిద్దలూరు మండలంలో నేడు ఎస్ఎంసీ ఎన్నికలు

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 28**



గిద్దలూరు మండలంలో గల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మంగళవారం పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించనున్నారు. మండల పరిధిలోని మొత్తం 88 పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటిలో 70 ప్రభుత్వ పాఠశాలలు కాగా, 18 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో 50 ప్రాథమిక పాఠశాలలు, 12 ఉన్నత పాఠశాలలు, 2 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు ఉండగా, ఎయిడెడ్ విభాగంలో 11 ప్రాథమిక, 4 అప్పర్ ప్రైమరీ, 3 ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కాలపట్టిక ప్రకారం 29వ తేది ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుంది. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు కమిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నికలను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నూతనంగా కొలువుదీరిన పాఠశాల యాజమాన్య కమిటీ తొలి సమావేశం జరగనుందని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. పాఠశాలల సమగ్ర అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, మెరుగైన మౌలిక వసతుల కల్పనతో పాటు పాఠశాలల నిర్వహణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల క్రియాశీలక భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో ఎస్ఎంసీలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని మండల విద్యాశాఖ అధికారి 2 పోలా నాగభూషణం రెడ్డి తెలిపారు. మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిబంధనల ప్రకారం జరిగేలా అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# భారత చైతన్య యువజన పార్టీ నూతన కార్యవర్గం




**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 28**

భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు శ్రీ బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పార్టీ బాధ్యతలు కమిటీలు వేయడం జరిగినది. అందులో భాగంగా మార్కాపురం జిల్లా కన్వీనర్ సిరిమామిళ్ల నరేంద్ర నేతృత్వంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా లీగల్ అడ్వైజర్ నరావుల శ్రీనివాస్ పర్యవేక్షణలో, జిల్లా కార్యవర్గ సూచనల గిద్దలూరు నియోజకవర్గమునకు కమిటీ వేయడం జరిగినది. ఈ కమిటీలో కమ్మనేతుల విజయరామరాజు గిద్దలూరు నియోజకవర్గ కో కన్వీనర్, మీసాల గోపాల్ యాదవ్ గిద్దలూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి, పెరగాని సుధాకర్ యాదవ్ ఉమ్మడి ప్రకాశం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్, చెన్నబోయిన రామకృష్ణ యాదవ్ మార్కాపురం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్, పందన బోయిన హరికృష్ణ గిద్దలూరు నియోజకవర్గ ప్రైవేట్ ఉద్యోగుల కన్వీనర్, ఆగోలు శివ నాగార్జున గిద్దలూరు నియోజకవర్గ ప్రైవేటు ఉద్యోగుల కో కన్వీనర్, కమతం రమేష్ గిద్దలూరు మండలం కన్వీనర్, గంగుల రాజకృష్ణ అర్ధవీడు మండల కన్వీనర్, నన్నే బోయిన రాజు ప్రైవేటు ఉద్యోగుల కన్వీనర్, కేతన బోయిన కాశి యాదవ్ గిద్దలూరు మండల ప్రచార కమిటీ కన్వీనర్, బత్తుల చంద్రశేఖర్ గిద్దలూరు నియోజకవర్గ వడ్డెర సామాజిక సెల్ కన్వీనర్, నన్నెబోయిన అరవింద్ గిద్దలూరు మండలం యూత్ కన్వీనర్ లుగా ప్రకటించడం జరిగినది. గిద్దలూరు పట్టణంలోని స్థానిక బీసీవై పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో విజయరామరాజు మీసాల గోపాల్ యాదవ్ పార్టీలో బాధ్యతలు తీసుకున్న కన్వీనర్ లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పార్టీలో బాధ్యతలు తీసుకున్న కన్వీనర్లు ,కో కన్వీనర్లు అందరూ బీసీవై పార్టీ అధినాయకులు రామచంద్రయ్య యాదవ్ సూచించిన ఆదేశాల మేరకు పార్టీ సిద్ధాంతాల కట్టుబడి పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయుటకు, గ్రామ సమస్యలను అధికార పార్టీ దృష్టికి తీసుకెళ్ళుటకు, అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి పంచాయతీలో బీసీవై పార్టీ పోటీ చేసే విధంగా కమిటీలు వేసుకొని, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతాయని మీడియాకు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ గిద్దలూరు నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు బాధ్యతలు తీసుకున్న అభ్యర్థులు అందరూ పాల్గొని కార్యక్రమంలో విజయవంతం చేశారని మీడియాకు తెలియజేశారు.

## నారాయణస్వామి ఆదాయం రూ. 2,00,309/- లు



**సి ఎస్ పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 28**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.2,00,309/-లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ.54,170/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా జమ రూ.22,340/- లు , శాశ్వత అన్నదాన పథకమునకు విరాళములు రూ.1,23,799/- లు వచ్చినట్లు తెలిపారు శాశ్వత అన్నదాన పథకమునకు మార్కాపురం జిల్లా పామూరు మండలం చట్టుమడుగు గ్రామ వాస్తవ్యులు కుందూరు శివరామయ్య ధర్మపత్ని జయలక్ష్మి వారి కుమారుడు కుందూరు బాలకృష్ణ ధర్మపత్ని రాజ్యలక్ష్మి రూ .1,00,001/- లు అందజేసినట్లు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో వరసిద్ధి వినాయక ఉత్సవాలు



**వలేటివారిపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

చుండి గ్రామంలోని పడమటి వీధిలో వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. గత 11 సంవత్సరాలుగా నిర్వాహకులు స్వామివారి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మికతను పంచుతున్నారు. 15 రోజులపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి స్వామివారికి అలంకరించిన వివిధ వస్తువులు, ప్రసాదాలకు ఘనంగా వేలం పాట నిర్వహించారు. స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని చుండి పడమటి వీధికి చెందిన భక్తుడు ముతకని రత్తయ్య రూ.75,000రూపాయలు కు దక్కించుకున్నారు.వేలం పాట సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాలు భక్తితో స్వీకరించారు. వినాయకుని కృపతో కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని భక్తులు ప్రార్థించారు. 11 ఏళ్లుగా ఉత్సవాలను నిరంతరంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను భక్తులు అభినందించారు.ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం చెంచు కామయ్య మరియు చెంచు బ్రహ్మయ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పడమటి వీధి వినాయక స్వామి యూత్ పోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# రైతుల ప్రయోజనాలకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

**- జలవనరులు శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు**

**- పునర్నిర్మాణ పనులు చేపట్టిన కారుమంచి మేజర్ కాలువ ప్రారంభించిన మంత్రి నిమ్మల**

**- పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు**









**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు జలవనరులు శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సోమవారం నిర్వహించిన పునర్నిర్మాణ పనులు చేపట్టిన కారుమంచి మేజర్ కాలువ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దిగువ ప్రాంతంలో 16 వేలకు పైగా ఎకరాలకు సాగునీరు, 16 గ్రామాలకు తాగునీరు అందించడంలో ఈ మేజర్ కెనాల్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు రూ.2.63 కోట్ల డీఎంఎఫ్ నిధులతో పాటు పి-4 కార్యక్రమం కింద స్థానిక ప్రముఖులు వెంకట శేషయ్య అందించిన రూ.25 లక్షలతో 500 మీటర్ల కాంక్రీట్ గట్టును నిర్మించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల వ్యవస్థను చక్కదిద్దుతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే నీటి వనరుల నిర్వహణ కోసం రూ.1308 కోట్లు ఇచ్చామన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం అని వ్యాఖ్యానించారు. రాయలసీమకు హంద్రీనీవా జలాలు తీసుకురావడంతో పాటు వెలిగొండ ప్రాజెక్టులోకి నీళ్లు, ఉత్తరాంధ్రకు గోదావరి వరద జలాలను తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐదు నెలలలోపే ఈ పనులను పూర్తి చేసినందున దిగు ప్రాంతాల్లోని ప్రజలకు త్రాగు, సాగునీటి అవసరాలు తీరబోతున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలోని ఇతర పనులను కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. 'జలధార - జల హారతి' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మూడువేలకు పైగా పనులను పూర్తి చేసామన్నారు. వర్షాలు వచ్చిన తర్వాత వాటి ఫలితాలు అందుతాయి అన్నారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సాగునీటి సౌలభ్యం కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ దిశగా తీసుకుంటున్న చర్యలే దీనికి నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వాటర్ మ్యాన్ గా, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును డిప్యూటీ వాటర్ మ్యాన్ గా దేశవ్యాప్తంగా గుర్తిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. వెలుగొండ, పోలవరం ప్రాజెక్టుల పట్ల వారు చూపిన ప్రత్యేక శ్రద్ధే దీనికి కారణం అన్నారు. 2014-19 కాలంలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం చెక్కు డ్యాములను నిర్మించింది అన్నారు. ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ త్రాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఎంతో కీలకమైన వెలుగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ఇటీవల ప్రారంభించారని, ప్రస్తుతం గ్రానైట్ ప్రాంతమైన చీమకుర్తిలో అభివృద్ధికి మరింత ఊతం ఇచ్చేలా అభివృద్ధి పరచిన కారుమంచి కాలువను జల వనరుల శాఖామంత్రి ప్రారంభిస్తుండటం సంతోషకరమన్నారు. ఈనెల 30వ తేదీన ఒంగోలులో నిర్వహించే మున్సిపాలిటీ 150 ఏళ్ల వేడుకలలో పాల్గొనాలని ప్రజలకు ఈ సందర్భంగా జనార్ధన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి, స్థానిక ప్రముఖులు నల్లూరి వెంకట శేషయ్య, ఏఎంసీ చైర్మన్ మన్నం ప్రసాద్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, స్థానిక ప్రముఖులు, అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## 150 సంవత్సరాల వేడుకల్లో మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల శ్రమను గుర్తించాలి

**- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర కమిటీ ధర్నా**



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అట్టహాసంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, నగర పాలక సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఈ సందర్భంగా ఒక నెల బోనస్, రెండు జతల బట్టలు ఇవ్వాలని కోరుతూ ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ( సిఐటియు ) ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో టి విజయమ్మ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా ను ఉద్దేశించి యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఒంగోలు నగరం.. మున్సిపాలిటీ గా ఏర్పడి. 150 సంవత్సరాలు వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని, మెగా మైగ్రేగేషన్ తడి చెత్త పొడి చెత్త వేరు చేయటంలో.. ప్రపంచ రికార్డు.. కార్మికుల శ్రమ వల్ల నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కష్టపడి పని చేసే కార్మికులకు ఒక నెల బోనస్ ఇవ్వమని అడిగితే గల్లా పెట్ట ఖాళీ అని ప్రజా ప్రతినిధులు అధికారులు చెప్తున్నారని పేర్కొన్నారు. దసరా లోపు బోనస్ అందించకుంటే.. నిరవధికంగా ఆందోళనకి వెళ్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. మహేష్, వై రవి, ఎం బాబు, కే వెంకటేశ్వర్లు, కే సాల్మన్, కే యాకోబు, ఆమని. రమాదేవి, నిర్మల, బి కోటేశ్వరరావు, బి. సుబ్బారావు. వై రాజశేఖర్, కే మోహన్ రావు, ఆర్ రాములు, సంతోషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా డీఆర్వోగా ఎం. శ్రీదేవి

**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 28**



మార్కాపురం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) గా ఎం. శ్రీదేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రస్తుతం ఏలూరు జిల్లాలో డిప్యూటీ కలెక్టర్, డీఆర్వోగా ఉన్న శ్రీదేవిని మార్కాపురం జిల్లాకు బదిలీ చేస్తూ పోస్టింగ్ ఇచ్చారు. ఆమెకు మంజూరైన ఎర్నాల్డ్ లీవ్ పూర్తయ్యాక కొత్త బాధ్యతల్లో చేరాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో గిద్దలూరు, కొమరోలు మండలాల తహసీల్దార్ గా శ్రీదేవి పనిచేశారు. ఆమె రిలీవింగ్, జాయినింగ్ తేదీలను ప్రభుత్వానికి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.కొత్త జిల్లా ఏర్పాటు నేపథ్యంలో రెవెన్యూ పరిపాలనను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం అధికారుల నియామకాలను వేగవంతం చేసింది. జిల్లాలో భూ సమస్యలు, రీసర్వే, రెవెన్యూ సేవలపై డీఆర్వో కీలకంగా వ్యవహరించనున్నారు. స్థానికంగా పనిచేసిన అనుభవం ఉండటంతో పరిపాలన సులభతరం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## ఇందిరమ్మ, సుందరయ్య కాలనీల సమస్యలు పరిష్కరించాలి





**మార్కాపురం,పెన్ పవర్ సెప్టెంబర్ 28**

ఇందిరమ్మ, సుందరయ్య కాలనీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు కాలనీవాసులు వినతి పత్రం అందించారు.ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో శాంతియుత నిరసన చేపట్టారు.దశాబ్దాలు గడుస్తున్నా ఈ రెండు కాలనీలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్నా సీసీ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, రవాణా సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కలెక్టర్ కాలనీల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, పట్టణ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, షేక్ బాజీ వలి, బేతం ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాషువా, భగత్‌సింగ్ ఆశయాలే నేటి తరానికి మార్గదర్శకం

**- మండల విద్యాశాఖ అధికారి వేమవరపు కోటేశ్వరరావు**





**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 28,**

సమాజంలో సమానత్వం కోసం కలంతో పోరాడిన మహాకవి గుర్రం జాషువా, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవవీరుడు భగత్‌సింగ్ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకాలని మండల విద్యాశాఖ అధికారి వేమవరపు కోటేశ్వరరావు అన్నారు. మహనీయుల ఆలోచనలు, త్యాగాలను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో సామాజిక బాధ్యత, దేశభక్తి, మానవతా విలువలను పెంపొందించవచ్చని పేర్కొన్నారు. గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి సందర్భంగా సోమవారం సంతమాగులూరులోని ఎమ్మార్సీ భవనంలో వారి చిత్రపటాలకు వేమవరపు కోటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి దార్ల దినేష్‌కుమార్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కుల, మత, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా జాషువా తన సాహిత్యం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం, సమానత్వం, మానవ గౌరవం కోసం ఆయన చేసిన సాహిత్య పోరాటం చిరస్మరణీయమన్నారు. భగత్‌సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం అత్యంత చిన్న వయసులోనే ధైర్యంగా పోరాడి అమరుడయ్యారని, ఆయన దేశభక్తి, త్యాగం, సాహసం యువతకు ఎప్పటికీ స్ఫూర్తినిస్తాయని చెప్పారు. విద్యార్థులు మహనీయుల జీవితాలను తెలుసుకోవడంతో పాటు వారి ఆశయాలను జీవితంలో ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాయల్ స్పోర్ట్స్ అకాడమీలో 70వ స్కూల్ గేమ్స్ బాక్సింగ్ సెలక్షన్స్



**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

మంగమూరు రోడ్డు లోని ఆశ్రమం వద్ద గల రాయల్ స్పోర్ట్స్ అకాడమీలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బాక్సింగ్ సెలక్షన్స్ సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. అండర్-14, అండర్-17, అండర్-19 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.రాయల్ స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ మందపాటి శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి స్కూల్ గేమ్స్ సెక్రటరీ పి. శివశంకర్, బాక్సింగ్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి. లూమెన్ రాజు, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమినేని సురేష్, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి శివ సిసింద్రీ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవడం వల్ల క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెరుగుతాయని అన్నారు. బాక్సింగ్‌లో నిరంతర సాధన, క్రమశిక్షణతో శిక్షణ పొందితే జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించే అవకాశం ఉందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తున్న రాయల్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులను అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రకాశం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సెలక్షన్స్‌కు శాప్ బాక్సింగ్ కోచ్ పాణ్యం వేణు నాయకత్వం వహించారు. కేలో ఇండియా బాక్సింగ్ కోచ్ కె. కృష్ణవేణి, అకాడమీ కోచ్ హరీష్ నందన్, ఉషు కోచ్ ప్రేమ్ తదితరులు ఎంపికల నిర్వహణలో పాల్గొన్నారు.

## పల్లె పండుగ సభావేదికను పరిశీలించిన బోయళ్ల నారాయణరెడ్డి




**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబరు 28**

వరికుంటపాడు మండలంలోని రామాపురం గ్రామంలో నిర్వహించనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమం సభా ప్రాంగణం లో జరుగుతున్న ఏర్పాటులను సోమవారం సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. భారీ ఎత్తున అభివృద్ధి పనులను రామాపురంలో నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పల్లె పండుగ 3.0 కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా చేపడుతున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి మల్లికార్జున, దర్శి ఆదినారాయణ, పోకల పాలకొండయ్య, చీప్ శీను పాల్గొన్నారు.

## శ్రీశైలం-మార్కాపురం రైల్వే మార్గంపై కేంద్రం స్పష్టత

**బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి**

**మార్కాపురం,పెన్ పవర్ సెప్టెంబర్ 28**



దశాబ్దాలుగా భక్తులు, ప్రజలు ఎదురుచూస్తున్న శ్రీశైలం-మార్కాపురం రైల్వే మార్గంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం శుభపరిణామమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రం శ్రీశైలానికి మెరుగైన రైల్వే కనెక్టివిటీ అవసరం ఎంతో కాలంగా ఉందన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా మౌలిక వసతులు, రైల్వే నెట్‌వర్క్ విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదనపై స్పష్టత రావడం ఆశాజనకమన్నారు. సికింద్రాబాద్ నుంచి శ్రీశైలం మీదుగా మార్కాపురం వరకు సుమారు 290 కి.మీ కొత్త లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే తెలంగాణ, పశ్చిమ, మధ్య భారతం నుంచి భక్తులు శ్రీశైలానికి సులభంగా చేరుకోవచ్చని తెలిపారు. ఈ లైన్ ప్రయాణికులకే కాకుండా ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, వాణిజ్యం, పర్యాటకం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు దోహదపడుతుందన్నారు. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు ప్రత్యామ్నాయ రైల్వే మార్గంగా కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపండి

**పీజీఆర్ఎస్ లో మొత్తం 216 అర్జీలు**

**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 28**

ప్రజల నుంచి వస్తున్న పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు.సోమవారం మార్కాపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) లో ఆమె అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లోనూ భూ సమస్యలపై అర్జీలు వస్తున్నాయన్నారు. అర్జీలను నమోదు చేసి వదిలేయకుండా మూల కారణాలు పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి పీజీఆర్ఎస్ లో రెవెన్యూ అర్జీలే ఎక్కువగా వస్తున్నాయని, వాటిపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఒకే సమస్యపై ప్రజలు మళ్లీ మళ్లీ అర్జీలు ఇచ్చే పరిస్థితి రాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి శాఖల సమన్వయంతో పని చేయాలని సూచించారు. సోమవారం పీజీఆర్ఎస్ లో మొత్తం 216 అర్జీలు రాగా, అందులో రెవెన్యూకు సంబంధించి 134, ఇతర శాఖలకు 82 వచ్చాయని అధికారులు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నుంచి 96 అర్జీలు వచ్చాయని, వాటిని ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీవోలు వెంకట శివరామిరెడ్డి, అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ మోహన్ రావు, వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జ్ బాలాజీ నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ షాహీర్ తదితరులు పాల్గొన్నారు.



# వైస్సార్సీపీ శ్రేణులు నాపై దుష్ప్రచారం మానుకోవాలి

## ఆధారాలు ఉంటే నిరూపించాలని దేవాలయం లో దీపం ఆర్పిన టిడిపి నాయకుడు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో పబ్బం గడుపుకునేందుకు దిగజారుడు విమర్శలా.





**జరుగుమల్లి, సెప్టెంబర్ 28 పెన్ పవర్**

నాపై దుష్ప్రచారం, ఆరోపణలు చేసి రాజకీయంగా అప్రతిష్ఠ పాలు చేస్తూ అసత్య ఆరోపణలు చేసిన వారు నిజం నిరూపించాలని హెచ్చరిస్తూ జరుగుమల్లి దేవాలయం లో ఆరోపణలు ఎదుర్కొంటున్న టిడిపి నాయకుడు ప్రమాణం చేసి దీపం ఆర్పడం చర్చనీయాంశం అయింది. ఆదివారం జరుగుమల్లి మండల వైస్సార్సీపీ విస్తృత కార్యకర్తల సమావేశంలో చోటు చేసుకున్న ఆరోపణ నేపథ్యంలో ఆరోపణ ఎదుర్కొన్న టిడిపి నాయకుడు స్పందించి వైస్సార్సీపీ శ్రేణులు చేసిన ఆరోపణలను ఖండించారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణం లో ప్రతిపక్ష పార్టీ శ్రేణులు ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఆరోపణ ఎదుర్కొంటున్నటిడిపి నాయకుడు హెచ్చరించారు. నిజంగా వైస్సార్సీపీ శ్రేణుల వద్ద ఆధారాలు ఉంటే వాటిని బయటపెట్టి ఆరోపణలను నిరూపించాలని కోరారు. ఇలాంటి చౌకబారు చర్యలతో టీడీపీ శ్రేణుల మనో ధైర్యాన్ని దెబ్బ తీయలేరని ఆయన హెచ్చరించారు. రాజకీయ పబ్బం గడుపుకునేందుకు కొండపి నియోజకవర్గం టి డి పి నాయకత్వం పై బురద చల్లే ప్రయత్నం మానుకోవాలని ఆయన హితవు చెప్పారు.వైస్సార్సీపీ ట్రాక్టర్ ఎవరిది? భోజనాలు ఎక్కడ నుండి ఎవరి ట్రాక్టర్ లో తోలారో చెప్పాలి. కంటి తుడుపు ప్రమాణం కాదు నిజాయితీగా చెప్పాలి. వైస్సార్సీపీ శ్రేణులు డిమాండ్ చేసారు. నిజాయితీ ఉంటే ఆదివారం వైస్సార్సీపీ కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండల విస్తృత కార్యకర్తల సమావేశానికి తన ట్రాక్టర్ లో తాను తన ఇంటి వద్ద నుండి భోజనం పంపింది నిజం కాదా అని వైస్సార్సీపీ శ్రేణులు నిలదీశారు. ఆరోపణ చేసింది భోజనం చెప్పిన వారి.మీద అయితే తనకి సానుభూతి,మద్దతు కోసం నియోజకవర్గం పెద్ద నాయకుల పేర్లు చెప్పి తప్పుకోవడం సరికాదని నిలదీస్తున్నారు. ప్రయాణాల మీద నమ్మకం ఉంటే పద్దతి ప్రకారం దీపం వెలిగించి ఆపాలే గాని మొక్కుబడిగా అలా చేసి ప్రకటనలు చేయడం కాదని వైస్సార్సీపీ శ్రేణులు దుయ్యబట్టారు.

## గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సహకారంతో సమస్యల పరిష్కారాన్ని కృషి

### కొమరోలు మండలం తాతిరెడ్డి పల్లె గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్న ముత్తుముల సంజీవరెడ్డి





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 28.**

గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సహకారంతో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల సలహాల మేరకు సంజీవరెడ్డి సోమవారం కొమరోలు గ్రామపంచాయతీ పరిధిలోని తాతిరెడ్డిపల్లి గ్రామంలో పర్యటించారు.ఆ సందర్భంగా ఆయన ఆ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్తు, తాగునీరు, సాగునీరు, వీధిదీపాలు, ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు తదితర సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆ గ్రామ ప్రజలతో మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామానికి కావలసిన మౌలిక సదుపాయాల కల్పన గురించి శాసనసభ్యులు అశోక్ రెడ్డికి తెలియజేసి ఆయన సూచనలు సలహాలు సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు కూడా తీసుకుంటానని తెలియజేస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడు తనకు తెలియజేసి వాటి పరిష్కారానికి తనకు సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి,,కొమరోలు మాజీ వార్డ్ మెంబర్ షేక్ సుభాని, తెలుగుదేశం పార్టీ నేతలు పాలుగుల్ల మల్లికార్జున్ రెడ్డి, ఖాజావలి, కరీముల్లా తో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు, తాతిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబా 191వ జయంతి వేడుకలు

**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 28**

సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెంలో అంబుల సాంబశివరావు శ్రీ సాయి సేవ ఆశ్రమం నందు సాయిబాబా 191వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబా కి ప్రత్యేక పూజలు ప్రత్యేక నిర్వహించారు. తదుపరి భక్తులచే సాయిబాబాకు పాలాభిషేకం చేయించడం జరిగింది. 191 వ జయంతి సందర్భంగా మక్కెనవారిపాలెం గ్రామ సాయిబాబా కమిటీ అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ సాయిబాబా గుడికి భక్తులు పెద్ద సంఖ్యలో రావడం భక్తులచే అభిషేకాలు సాయి సత్యవ్రతాలు తదుపరి మక్కెనవారిపాలెంలో తొలిసారిగా జరిగిందని కమిటీ అధ్యక్షులు రాంబాబు తెలిపారు.



# ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పై అవగాహన కలిగి ఉండాలి





**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై విద్యార్థులు అవగాహన కలిగి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ వారి అధ్వర్యంలో ఒంగోలు ప్రభుత్వ రెసిడేన్షియల్ బదిరుల పాశాలలో అంతర్జాతీయ సంజ్ఞ /సంకేత భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి ముఖ్య అతిథిగా హాజరై, వినికిడి లోపం గల విద్యార్థులను, ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి, మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా 8 మంది అర్హులైన లబ్దిదారులకు టచ్ ఫోన్లను జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలానే వారి సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని జాయింట్ కలెక్టర్ తెలియజేసి, సంజ్ఞ /సంకేత భాషా పోస్టరను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యంగా టచ్ ఫోన్ వలన కలిగే దుష్ప్రయోజనాలు, మత్తు పదర్థాలు వలన యువత వారి భవిష్యత్తు ఆరోగ్యానికి కలిగే నష్టాలు, బాలికలు ప్రదర్శించిన గుడ్.. బాడ్ టచ్ ఎంతో విశిష్టంగా ఆకట్టుకున్నాయి. ప్రకాశం జిల్లా హియరింగ్ ఇంపైరెడ్ ఎంప్లాయ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే. సత్యనారాయణ, ప్రకాశం జిల్లా హియరింగ్ ఇంపైరెడ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యం. రాజేంద్ర లు తమ సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, చి. సువార్త, ప్రభుత్వ బదిరుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, ఎస్ కే ఆర్ స్పెషల్ డెఫ్ స్కూల్ ప్రతినిధి అంజిరెడ్డి, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాషువా సాహిత్యం సామాజిక చైతన్యానికి అక్షరాయుధం

## కుల మత భేదాలకు తావులేని మానవత వాదాన్ని చాటిన మహాకవి వడ్లమాని నారాయణ చారి



**సి.ఎస్.పురం,పెన్ పవర్ సెప్టెంబరు 28**

జనులంతా ఒకే కుటుంబమని జగమంతా ఒకే నిలయమని చాటి, కులమత బేధాలకు అతీతంగా మానవతా విలువలను తన సాహిత్యం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన విశ్వనరుడు, మహాకవి, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని మండల కళాకారుల సంఘం కమిటీ సభ్యులు వడ్లమాని నారాయణచారి అన్నారు. జాషువా జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం ఆయన మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూ, అణగారిన వర్గాల వేదనను అక్షరాల రూపంలో ఆవిష్కరించిన గొప్ప కవి జాషువా అని కొనియాడారు. కవిత్వం కేవలం సాహిత్యానికే పరిమితం కాకుండా సమాజాన్ని మేల్కొలిపే సాధనంగా ఉండాలని తన రచనల ద్వారా నిరూపించారని పేర్కొన్నారు.1895 సెప్టెంబరు 28న వీరయ్య, లింగమ్మ దంపతులకు జన్మించిన జాషువా చిన్ననాటి నుంచే ఎన్నో సామాజిక, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారని తెలిపారు. సమాజంలో ఎదురైన వివక్ష, పేదరికం, అస్పృశ్యత వంటి అనుభవాలే ఆయనలో సామాజిక చైతన్యాన్ని పెంచాయని అన్నారు. తన జీవితంలోని బాధలను నిరాశగా కాకుండా సమాజ మార్పు కోసం వినిపించిన అక్షర స్వరంగా మలిచారని పేర్కొన్నారు. జాషువా రచనల్లో గబ్బిలం, స్వప్న కథ, ముంతాజ్ మహల్, స్వయంవరం, క్రీస్తు చరిత్ర, నాగార్జునసాగర్, బాపూజీ, నేతాజీ, కొత్త లోకం వంటి కావ్యాలు ఖండకావ్యాలు నాటకాలు, జీవిత చరిత్ర రాసిన ఘనతని అన్నారు దేవాలయ ప్రవేశం అంటే సామాజిక అంశాలతో పాటు అణగారిన మనిషి ఆవేదనను శక్తివంతమైన పద్య రూపంలో వ్యక్తీకరించి సరళమైన భాష పదునైన భావం సామాజిక స్పృహ పాఠకులను ఆలోచింపజేస్తాయని అన్నారు గుర్రం జాషువాకు కవి కోకిల కవితా విశారద తదితర బిరుదులు వచ్చాయన్నారు భారత ప్రభుత్వం పద్మభూషణ బిరుదుతో సత్కరిస్తూ అత్యున్నత పురస్కారాలు అందుకున్న ఘనత గుర్రం జాషువాని అన్నారు నా జీవితం వడగాల్పు అయినా... నా కవిత్వం వెన్నెల వెలుగు అనే భావం జాషువా ప్రస్తానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు పేదరికం అస్పృశ్యత తనకు గురువులుగా మారాయని జాషువా చెప్పిన మాటలు సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తాయన్నారు కులము మతము వర్గము పేరుతో మనుషుల మధ్య ఏర్పడే మంత్రాలను తొలగించి ప్రతి మనిషిని సమానంగా చూడాలని సందేశాన్ని జాషువా తన రచనల ద్వారా అందించి పద్యాలు కవితలు రచనలు నేటి తరానికి కూడా సామాజిక బాధ్యతను గుర్తుచేస్తాయన్నారు జాషువా సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదివి ఆయన చూపిన మానవతా మార్గాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు.

# రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఖండించిన మాదినేని లక్ష్మణ్



**సి.ఎస్.పురం, పెన్ పవర్ సెప్టెంబరు 28**

దేశ ప్రజాస్వామ్యానికి కీలకమైన ఎన్నికల ప్రక్రియపై, రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేస్తున్న వ్యాఖ్యలను జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మాదినేని లక్ష్మణ్ ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలపై అసంతృప్తితో ప్రజల్లో అనుమానాలు, అపోహలు కలిగించేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఎన్నికల సంఘం పనితీరుపై అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో, ఆధారాలతో సంబంధిత వ్యవస్థలను ఆశ్రయించాలని సూచించారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తిస్తోందని అన్నారు ఈవీఎంల ట్యాంపరింగ్, రాజ్యాంగ సంస్థలు పనిచేయడం లేదంటూ చేస్తున్న ప్రచారంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు ఒకవైపు ఈవీఎంలపై ఆరోపణలు చేస్తూ, మరోవైపు అదే ఈవీఎం లతో కాంగ్రెస్ పార్టీ వివిధ రాష్ట్రాల్లో విజయాలు సాధించారన్నారు ఈవీఎంలు ట్యాంపరింగ్ అయితే ఆ రాష్ట్రాలలో కాంగ్రెస్ ఎలా గెలిచిందో ప్రజలకు వివరించాలన్నారు ప్రజాస్వామ్య వ్యవస్థ పై ప్రజలకు నమ్మకం కలిగించే బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందన్నారు ఓట్ల చోరీ కి సంబంధించిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే వాటిని ప్రజలకు రాజ్యాంగ సంస్థలకు అందజేయాలన్నారు గెలిస్తే ఈవీఎంలు బాగా పనిచేశాయి ట్యాంపరింగ్ తో ఓడిపోయామని తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అబద్ధపు ప్రచారాలు మానుకొని దేశ ప్రజలకు ఎన్నికల సంఘానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# రాయలసీమ ఉద్యాన సమగ్ర అభివృద్ధి ప్రాజెక్ట్‌పై భారీ డ్రోన్ షో

**– ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజబాబు**



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను భారతదేశంలోనే అత్యంత కీలకమైన గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా (ప్రపంచ ఉద్యాన కేంద్రం) రూపాంతరం చెందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక అడుగులు వేస్తోంది. ఈ బృహత్తర ప్రాజెక్ట్ ప్రాముఖ్యతను, ప్రతిపాదిత ప్రణాళికలను ప్రజలకు, యువతకు దృశ్యరూపంలో వివరించి, వారిలో విస్తృత అవగాహన కల్పించేందుకు ఒంగోలు సమీపంలోని రైస్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం 7:30 గంటలకు భారీ డ్రోన్ షో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజబాబు వెల్లడించారు. శతాబ్దాల కరువును అధిగమించి రాయలసీమ ప్రాంతం ఏ విధంగా రూపురేఖలు మార్చుకోబోతోందో ఆకాశంలో రంగురంగుల డ్రోన్‌ల కాంతుల ప్రదర్శన ద్వారా కళ్లకు కట్టినట్లు ప్రదర్శించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ వివరాలను కలెక్టర్ సుదీర్ఘంగా వివరించారు. తక్కువ వర్షపాతం, కరువు పీడిత ప్రాంతంగా ఉన్న రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చేందుకు రూ. 1,00,000 కోట్ల అంచనా వ్యయంతో 'ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్ ' రూపకల్పన చేశామన్నారు. 2026 నుండి 2029 వరకు మొత్తం మూడు విడతల్లో, 10 జిల్లాల పరిధిలోని 201 క్లస్టర్లలో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 6 లక్షల హెక్టార్లలో కొత్తగా తోటబడుల విస్తరణ జరుగుతుందని, దీనివల్ల నేరుగా 9.6 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరడంతో పాటు 49.3 లక్షల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ?ముఖ్యంగా మామిడి, అరటి, టమోటా, దానిమ్మ, ఖర్జూరం, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ వంటి లాభదాయక పంటల సాగును ప్రోత్సహించడం, భారీ స్థాయిలో ఎగుమతులు, అధునాతన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతాన్ని భారతదేశంలోనే అతిపెద్ద 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ మహా సమగ్ర విప్లవాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 'రీల్స్ / వీడియో కాంటెస్ట్'ను కూడా అందుబాటులోకి తెచ్చిందని, యువత, డిజిటల్ క్రియేటర్లు తమ సృజనాత్మకతతో ఇందులో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మంగళవారం సాయంత్రం రైజ్ కాలేజీ వేదికగా జరిగే అద్భుత డ్రోన్ షోను ప్రజలు, యువత, రైతులు అధిక సంఖ్యలో తిలకించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు పిలుపునిచ్చారు.

# నేడు పీర్ల మాన్యం పరిసరాల్లో విద్యుత్ అంతరాయం

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 28**

విద్యుత్ మరమ్మత్తుల దృష్ట్యా మంగళవరం ఉదయం 08.00 గంటల నుండి 12.00 గంటల వరకు, పీర్లమాన్యం, సమతా నగర్, గణపతినగర్, శ్రీ కృష్ణ నగర్, అరుణోదయ కాలనీ పరిసర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కేవీ పాండురంగారావు ఒక ప్రకటనలో తెలియజేశారు . కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# అక్షరానికి ఆత్మగౌరవాన్ని అద్దిన మహాకవి గుఱ్ఱం జాషువా

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 28**

అక్షరానికి ఆత్మగౌరవాన్ని అద్దిన మహాకవి గుఱ్ఱం జాషువా అని గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ అజయ్ కుమార్ అన్నారు. సోమవారం గుఱ్ఱం జాషువా 131వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముందుగా గుఱ్ఱం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ, గుఱ్ఱం జాషువా అట్టడుగు వర్గానికి చెందిన కుటుంబంలో జన్మించి, కడు పేదరికాన్ని అనుభవించారని తెలిపారు. సామాజిక వివక్షకు గురైనప్పటికీ, అవమానాలను అనుభవాలుగా మలుచుకుని విద్యను అభ్యసించారని అన్నారు. అనంతరం మిషనరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారని పేర్కొన్నారు. జాషువా తన కవిత్వం ద్వారా 36 గ్రంథాలు, అనేక కవితా ఖండికలు రచించి తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించారని అన్నారు. ఆయన సాహిత్య సేవలకు కేంద్ర సాహిత్య పురస్కారం, కళాప్రపూర్ణ బిరుదు, పద్మభూషణ్ వంటి గౌరవాలు లభించాయని తెలిపారు. దళిత ఉద్యమ నేత కాల్వ మహేష్ మాట్లాడుతూ, "అణగారిన గొంతుకకు అక్షరాన్ని ఆయుధంగా మార్చిన కవి గుఱ్ఱం జాషువా" అని అన్నారు. తలవంచమన్న సమాజం ముందు తన కలంతో తలెత్తి నిలిచిన మహాకవి జాషువా అని పేర్కొన్నారు. ఆయన రచనలు నేటి సమాజానికి ఆదర్శప్రాయమని తెలిపారు. సామాజిక వివక్షను ప్రశ్నించిన జాషువా, అన్ని కులాలు, మతాలు సమానమనే సందేశాన్ని తన రచనల ద్వారా చాటిచెప్పారని అన్నారు. "మనుషులందరిదీ ఒకటే కులం.. మనది మానవ కులం" అనే గొప్ప సందేశాన్ని సమాజానికి అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుఱ్ఱం జాషువా సేవా సమితి అధ్యక్షులు గుఱ్ఱం బాబురావు, దుగ్గపోగు రవికుమార్, మంద ప్రవీణ్ కుమార్, దున్న అశోక్. తదితరులు పాల్గొన్నారు.



# సచిన్‌తో పోలిక నాకొద్దు.. ఆయన ఒక లెజెండ్: కోహ్లీ

- వెస్టిండీస్‌పై సెంచరీతో చెలరేగిన విరాట్ కోహ్లీ
- క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రెండు రికార్డులు బద్దలు
- వన్డేల్లో అత్యంత వేగంగా 15వేల పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా కోహ్లీ ఘనత
- భారత్ గడ్డపై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కొత్త చరిత్ర
- సచిన్‌తో పోలికపై స్పందన.. అతడి స్థానం ఎప్పటికీ ప్రత్యేకం అన్న విరాట్



టీమిండియా స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ తన పరుగుల దాహాన్ని కొనసాగిస్తున్నాడు. వెస్టిండీస్‌తో నిన్న తిరువనంతపురంలో జరిగిన మొదటి వన్డేలో అద్భుత శతకంతో చెలరేగిన కోహ్లీ, భారత జట్టుకు ఘన విజయాన్ని అందించడమే కాకుండా.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రెండు ప్రధాన రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ కేవలం 88 బంతుల్లోనే 139 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.ఈ ఇన్నింగ్స్‌లో భాగంగా కోహ్లీ వన్డే క్రికెట్‌లో 15,000 పరుగుల మైలురాయిని అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇంతకుముందు సచిన్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. అయితే, కోహ్లీ కేవలం 303 ఇన్నింగ్స్‌లలోనే ఈ మార్కును చేరగా, సచిన్‌కు దీనికోసం 377 ఇన్నింగ్స్‌లు అవసరమయ్యాయి. అంటే.. సచిన్ కంటే 74 ఇన్నింగ్స్‌లు తక్కువ ఆడి ఈ రికార్డును కోహ్లీ సొంతం చేసుకోవడం విశేషం.ఇదే మ్యాచ్‌లో కోహ్లీ మరో అరుదైన రికార్డును కూడా అధిగమించాడు. భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సచిన్ (6,976) పేరిట ఉన్న రికార్డును కోహ్లీ బ్రేక్ చేశాడు. ఈ మ్యాచ్‌తో కోహ్లీ స్వదేశంలో 7,006 పరుగులు పూర్తి చేసి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇది కోహ్లీకి వన్డేల్లో 55వ సెంచరీ కాగా, లిస్ట్-ఏ క్రికెట్‌లో 60వ శతకం. ఈ క్రమంలో లిస్ట్-ఏ సెంచరీల విషయంలోనూ సచిన్ రికార్డును సమం చేశాడు.మ్యాచ్ అనంతరం తన రికార్డులు, సచిన్‌తో పోలికలపై కోహ్లీ వినమ్రంగా స్పందించాడు. "నాకు సచిన్ పాజీ ఎప్పటికీ సచిన్ పాజీనే. అతను తన కాలంలో ఆటలో విప్లవాత్మక మార్పులు తెచ్చాడు. అది సంఖ్యలు, పోలికలకు అతీతమైన విషయం. ప్రజలపై అతను చూపిన ప్రభావం ఎప్పటికీ నిలిచిపోతుంది" అని వ్యాఖ్యానించాడు.

# ఆసియా క్రీడలు: వర్షంతో మ్యాచ్ రద్దు..
# నేరుగా సెమీస్‌కు టీమిండియా

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల్లో భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య జరగాల్సిన రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న టీమిండియా నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. కరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు.ఉదయం 5:30 గంటలకు జరగాల్సిన పాకిస్థాన్-హాంకాంగ్ తొలి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కూడా ఇదే కారణంతో రద్దయింది. ఆ మ్యాచ్‌లోనూ అధిక ర్యాంకింగ్ ఆధారంగా పాకిస్థాన్ సెమీస్‌కు చేరుకుంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్ 1 స్థానంలో ఉండగా.. ఆఫ్ఘనిస్థాన్ 10వ స్థానంలో ఉంది. మరోవైపు పాకిస్థాన్ 6వ ర్యాంకులో, హాంకాంగ్ 24వ ర్యాంకులో కొనసాగుతున్నాయి. ఈ నిబంధనల ప్రకారమే భారత్, పాక్ జట్లు ముందంజ వేశాయి.సెమీఫైనల్లో శ్రీలంక, నేపాల్ మధ్య జరిగే మూడో క్వార్టర్ ఫైనల్ విజేతతో భారత్ తలపడుతుంది. మరో సెమీస్‌లో బంగ్లాదేశ్, మలేషియా మధ్య జరిగే నాలుగో క్వార్టర్ ఫైనల్ విజేతతో పాకిస్థాన్ పోటీ పడుతుంది. మిగిలిన క్వార్టర్ ఫైనల్స్ మంగళవారం, సెమీఫైనల్స్ గురువారం జరగనున్నాయి.



# భారత జట్టులో నో ఛాన్స్.. రెస్టాఫ్ ఇండియా
# కెప్టెన్ రిషబ్.. శ్రీనగర్ ఫ్లైట్ ఎక్కిన పంత్ మావా!

**హైదరాబాద్ పెన్ పవర్:** రాబోయే ఇరానీ కప్ 2026-27 కోసం రెస్టాఫ్ ఇండియా కెప్టెన్ రిషబ్ పంత్ ఈరోజు (సోమవారం, సెప్టెంబర్ 28) న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శ్రీనగర్‌కు బయలుదేరారు. రంజీ ట్రోఫీ ఛాంపియన్స్ గా నిలిచిన జమ్మ అండ్ కశ్మీర్‌తో జరగనున్న ఐదు రోజుల ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లో రెస్టాఫ్ ఇండియా జట్టుకు పంత్ నాయకత్వం వహించనున్నారు. ఈ మ్యాచ్ అక్టోబర్ 1 (గురువారం) నుంచి ప్రారంభంకానుంది. భారత జట్టు త్వరలో ఆడబోయే న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో, ఈ ఐదు రోజుల మ్యాచ్ రిషబ్ పంత్‌కు రెడ్-బాల్ క్రికెట్‌లో తగినంత రిథమ్, మ్యాచ్ ప్రాక్టీస్‌ను అందించనుంది.



**జమ్ము అండ్ కశ్మీర్ తొలి ప్రదర్శన:**
ఈ ప్రతిష్టాత్మక దేశీయ ఫస్ట్-క్లాస్ టోర్నమెంట్‌లో జమ్ము అండ్ కశ్మీర్ జట్టు అడుగుపెట్టడం ఇదే మొదటిసారి కావడం విశేషం. కాగా తొలిసారి ఆడబోతున్న ఇరానీ కప్ 2026-27ని సొంతం చేసుకోవాలని జమ్ము టీమ్ ప్లాన్ చేస్తుండగా.. పంత్ తనదైన వ్యూహాలతో బరిలోకి దిగబోతున్నాడు. మరోవైపు, భారత క్రికెట్ నియంత్రణ మండలి ( సెప్టెంబర్ 16 నాడు 15 మంది సభ్యులతో కూడిన రెస్టాఫ్ ఇండియా జట్టును ప్రకటించింది. వెన్నునొప్పి గాయం నుంచి కోలుకుంటున్న ఆకాశ్ దీప్ ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి జట్టులో చోటు దక్కించుకున్నారు.

**ఇరానీ కప్ 2026 మ్యాచ్ వివరాలు:**
మ్యాచ్: జమ్ము & కశ్మీర్ జం రెస్టాఫ్ ఇండియా, ఇరానీ కప్ 2026-27.
తేదీ: గురువారం, అక్టోబర్ 1 నుండి సోమవారం, అక్టోబర్ 5, 2026 వరకు.
వేదిక: శ్రీనగర్, జమ్ము & కశ్మీర్.
ఎడిషన్: 63వది.
రెస్టాఫ్ ఇండియా కెప్టెన్: రిషబ్ పంత్.
రెస్టాఫ్ ఇండియా వైస్ కెప్టెన్: సర్ఫరాజ్ ఖాన్.
జమ్ము & కశ్మీర్ కెప్టెన్: పరాస్ డోగ్రా.

**రెస్టాఫ్ ఇండియా జట్టు:**
రిషబ్ పంత్ (కెప్టెన్‌లి/వికెట్ కీపర్), సనత్ సాంగ్వాన్, శిఖర్ మోహన్, సుదీప్ ఘరామి, సర్ఫరాజ్ ఖాన్ (వైస్ కెప్టెన్), స్మరన్ రవిచంద్రన్, మానవ్ సుతార్, శరన్ష్ జైన్, ఆకాష్ దీప్‌లి, ముఖేష్ కుమార్, ముఖేష్ చౌదరి, ఆర్యన్ జుయల్ (ఔఖ), ఆర్యన్ పాండే, అనుకుల్ రాయ్, ఆయుష్ దోసెజా

# నెట్ వర్త్ లిస్ట్ లో లేకుంటే ఏంటి?..
# మంచి మనసుతోనే..



రెబల్ స్టార్ ప్రభాస్ పేరు పెద్ద పెద్ద నెట్ వర్త్ లిస్టుల్లో కనిపించకపోవచ్చు. ఆయన సంపాదన ఎంత అనేది కూడా బయట ప్రపంచానికి పూర్తిగా తెలియకపోవచ్చు. కానీ మంచి పనులు చేసే విషయంలో మాత్రం ప్రభాస్ ఎప్పుడూ ముందే ఉంటారు. సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి అందిస్తూ తన మంచి మనసును చాటుకుంటున్నారు.

సినిమాల పరంగా ప్రభాస్ రేంజ్ ఏంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాహుబలి తర్వాత ఆయన రేంజ్ పూర్తిగా మారిపోయింది. వరుసగా పాన్ ఇండియా సినిమాలు చేస్తూ దేశవ్యాప్తంగా భారీ మార్కెట్ ను సొంతం చేసుకున్నారు. ఒక్కో సినిమాకు వందల కోట్ల రెమ్యూనరేషన్ తీసుకుంటున్నారనే వార్తలు కూడా చాలాకాలంగా వినిపిస్తున్నాయి.అయితే ఒక నటుడి రెమ్యూనరేషన్, నెట్ వర్త్ రెండూ ఒకటి కాదు. సినిమాల ద్వారా వచ్చిన డబ్బులో టాక్సులు, ఖర్చులు, పెట్టుబడులు, కుటుంబ బాధ్యతలు ఇలా ఎన్నో ఉంటాయి. అందుకే బయట కనిపించే లెక్కలతో ఒక స్టార్ అసలు సంపదను అంచనా వేయడం అంత ఈజీ కాదు. ప్రభాస్ విషయంలో మరో విషయం ఎక్కువగా కనిపిస్తుంది. ఆయన చేసే సేవా కార్యక్రమాలు. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు భారీ మొత్తాల్లో విరాళాలు అందించారు. తెలుగు రాష్ట్రాల్లో వరదల సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్స్ కు సాయం చేశారు.కేరళలో వయనాడ్ విపత్తు సమయంలో కూడా బాధితుల కోసం విరాళం ఇచ్చారు. కరోనా సమయంలోనూ ప్రభాస్ భారీ మొత్తంలో ఆర్థిక సాయం చేశారు. కేంద్రంతో పాటు తెలుగు రాష్ట్రాల సహాయ నిధులకు విరాళాలు అందించారు. ఆ సమయంలో సినిమా కార్మికులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు కూడా అండగా నిలిచారు. కరోనా క్రైసిస్ ఛారిటీకి సాయం చేశారు.సినిమా రంగానికి మాత్రమే కాకుండా పర్సనల్ గా కూడా అవసరంలో ఉన్నవారికి ప్రభాస్ సాయం చేసిన సందర్భాలు ఉన్నాయి.

అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేసినట్లు పలు సందర్భాల్లో వార్తలు వచ్చాయి. పర్యావరణం విషయంలో కూడా ప్రభాస్ తన వంతు బాధ్యత తీసుకున్నారు. హైదరాబాద్ సమీపంలోని కాజిపల్లి అర్బన్ ఫారెస్ట్ ప్రాంతాన్ని దత్తత తీసుకుని దాని అభివృద్ధికి కోపరేట్ చేశారు. పచ్చదనం పెంచే కార్యక్రమాల్లోనూ భాగమయ్యారు.ప్రభాస్ చేసే ప్రతి సాయం పెద్దగా ప్రచారంలోకి రావాలని ఆయన కోరుకోరనే పేరుంది. కొన్ని సందర్భాల్లో ఆయన చేసిన సహాయం బయటకు వచ్చిన తర్వాతే అభిమానులకు విషయం తెలుస్తుంది. అందుకే ప్రభాస్ అభిమానులు ఆయనను స్క్రీన్ పై మాత్రమే కాదు.. నిజ జీవితంలో కూడా బాహుబలిగా చూస్తుంటారు. నెట్ వర్త్ లిస్టులో పేరు ఉందా లేదా అనేది పక్కన పెడితే.. సంపాదనలో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి ఇవ్వడం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం కూడా ఒక వ్యక్తి వాల్యూను చూపిస్తుంది. అందుకే నెట్ వర్త్ లిస్టుల్లో పేరు లేకపోయినా.. మంచి పనులతో మాత్రం ప్రభాస్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com